ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట	: 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు	: 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు	: 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్లపల్లి	: 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు	: 99890 59755



ముక్కంటి ఆలయంలో రద్దీ

శ్రీకాళహస్తి, మే 23 : శ్రీకాళహస్తీశ్వరాలయం గురువారం భక్తజన సంద్రంగా మారింది. పౌర్ణమిని పురస్కరించుకుని రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. సుమారు 27వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 6457మంది, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 1,667మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 1,850మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 488మంది, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 197మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 148మంది, రూ.5వేల టిక్కెట్ల ద్వారా 50మంది భక్తులు పూజలుచేయించుకున్నారు. ఇక ఐదు రకాల ప్రసాదాలు కలిపి 15,049అమ్ముడైనట్లు ఆలయ అధికారులు తెలిపారు.

కమనీయం.... నృసింహుడి కల్యాణం

డక్కిలి, మే 23 : వెంకటగిరి నియోజకవర్గ పరిధిలోని పెంచలకోనలో గురువారం ఉదయం చెంచులక్ష్మి, ఆదిలక్ష్మి సమేత పెంచల స్వామి కల్యాణం కన్నుల పండువగా జరిగింది. స్వామి వారికి ఆలయ అధికారులు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. స్వామివారి కల్యాణం సందర్భంగా పలు జంటలు వివాహంతో ఒక్కటయ్యాయి. అనంతరం అర్చకులు చేపట్టిన ఎదుర్కోలు ఉత్సవం భక్తులను ఆకట్టుకుంది. గురువారం రాత్రి దేవేరులతో కలిసి పెంచలస్వామి రథంపై భక్తులకు దర్శనమిచ్చారు.ఆలయం నుంచి కోన ముఖ ద్వారం వరకు భక్తులు రథాన్ని లాగి మొక్కులు తీర్చుకున్నారు.ఏసీ డి.వెంకటేశ్వర్లు, డీసీ కె.విజయసాగర్ సాగరబాబు, ఆలయ ఇన్‌స్పెక్టర్ హరీష్, ఆలయ ప్రధాన అర్చకులు రామయ్య స్వామి, శశికుమార్ స్వామి, గుండ్లూరు సీతారామయ్య, పెంచలయ్య, బాలాజి, మధు స్వామితో పాటు టీటీడీ అర్చకులు పాల్గొన్నారు.బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం 8.30 గంటలకు వసంతోత్సవం, చక్ర స్నానం, రాత్రి 7 గంటలకు తెప్పోత్సవం,10 గంటలకు అశ్వవాహన సేవ, రాత్రి 11.30 గంటలకు ధ్వజావరోహణ కార్యక్రమాలు జరుగుతాయి.



కళ్యాణోత్సవం



తిరుమల కిటకిట

తిరుమలలో మళ్లీ భక్తుల రద్దీ పెరిగింది. శ్రీవారి ఆలయ ప్రాంతంతో పాటు మాడవీధులు, అఖిలాండం, లడ్డూకౌంటర్, అన్నప్రసాద భవనం, లేపాక్షి సర్కిల్ ప్రాంతాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి.గదుల కోసం సీఆర్వో, ఎంబీసీ, పద్మావతి, టీబీ, ఏఆర్పీ కౌంటర్ల వద్ద భక్తులు క్యూలైన్లలో బారులు తీరారు. తలనీలాలు సమర్పించే కల్యాణకట్టలు కూడా భక్తులతో నిండిపోయాయి.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

ఎన్నికల ఫలితాలపై ఎవరి ధీమా వారిదే!

గెలుపుపై నమ్మకాలు ఆధిక్యతపై అంచనాలు



ఈవీఎం పెట్టెల్లో దాగిన విజయ రహస్యం జూన్ 4న కానీ బట్టబయలు కాదు. ఇంత సుదీర్ఘకాలం ఎదురు చూడాల్సిరావడం రాజకీయ నాయకులకు హింసగా ఉంది. దీంతో పోలింగ్ తీరును విశ్లేషించుకుంటూ గెలుపు ఓటముల అంచనాల్లో మునిగి తేలుతున్నారు. తమ విజయానికి దారితీసే అంశాలనూ, ఎదుటి పక్షం బలం తగ్గిన కారణాలనూ చర్చించుకుంటున్నారు.జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో ఉభయపార్టీల్లో నడుస్తున్న అంచనాల తీరు ఇలా ఉంది.

వెంకటగిరి

ఉభయుల్లో ఒకే ధీమా

వెంకటగిరి నియోజకవర్గంలో తమ విజయం ఖాయమని టీడీపీ వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి.ఎక్కడా ప్రత్యర్థికి తగ్గకుండా ఎన్నికల్లో ఢీకొన్న కారణంగా విజయావకాశాలను దెబ్బతీసే పరిస్థితులేవీ లేవని టీడీపీ వర్గాలు భావిస్తున్నాయి. గెలుపు తమదేనని, కనీసం 15 వేల ఓట్ల మెజారిటీతో గెలుస్తామని నమ్మకంగా చెబుతున్నాయి. అదే సమయంలో వైసీపీ వర్గాల అంచనాలు భారీగా వుంటున్నాయి. ఆర్థిక వనరులు పుష్కలంగా వినియోగించామని, అభ్యర్థి జిల్లా వైసీపీ అధ్యక్షుడు కనుక జిల్లాలో తమకే అత్యధిక మెజారిటీ వస్తుందన్న ధీమా వారిలో వ్యక్తమవుతోంది.

గూడూరు

గట్టెక్కుతామంటున్న వైసీపీ

గూడూరులో టీడీపీ సూపర్ సిక్స్ హామీలు ప్రభావం చూపాయని, వాటి పట్ల మహిళలు అధికంగా ఆకర్షితులు కావడం వల్లే వారి పోలింగ్ శాతం పెరిగిందని టీడీపీ వర్గాలు భావిస్తున్నాయి. మెజారిటీ మహిళల ఓట్లన్నీ తమకే పడ్డాయన్నది వారి భావన. గెలుపు తమదేనని, హీనపక్షం 5 వేల ఓట్ల మెజారిటీతో అయినా గెలుస్తామని నమ్మకంగా చెబుతున్నారు. ఇక వైసీపీ విషయానికొస్తే గత ఎన్నికల్లో 45 వేల ఆధిక్యత వచ్చిందని, అందులో ఎంత కోత పడినా మహిళల మద్దతుతో కనీసం 10 వేల మెజారిటీతో గెలుస్తామని అంచనా వేస్తున్నారు.

శ్రీకాళహస్తి

టీడీపీలో విజయోత్సాహం

శ్రీకాళహస్తిలో వైసీపీ వర్గీయుల అంచనా భారీగా తగ్గిపోయింది. పెద్దఎత్తున ఆర్థిక వనరులు వినియోగించినా అవేవీ ఫలితాలపై ప్రభావం చూపించే అవకాశం లేకపోవడంతో ఎలాగోలా 2 వేల నుంచీ 5 వేల వరకూ ఆధిక్యత సాధిస్తామని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అదే సమయంలో టీడీపీ వర్గీయులు మాత్రం విజయంపై భారీ అంచనాలు వేస్తున్నారు. అధమపక్షం 10 వేల నుంచీ 15 వేల మెజారిటీతో గెలుస్తామన్న ధీమా వ్యక్తం చేస్తున్నారు.

సూళ్లూరుపేట

గెలుపు ఆశతో వైసీపీ

సూళ్లూరుపేటలో అధికార పార్టీ వర్గాలు తమకు దొరవారిసత్రం మండలంలో భారీ మెజారిటీ వస్తుందని, దానివల్ల సూళ్లూరుపేట, తడ మండలాల్లో టీడీపీ సాధించే మెజారిటీని అధిగమించి 3 వేల నుంచీ 5 వేల మెజారిటీతో గట్టెక్కుతామని భావిస్తున్నాయి. అదే సమయంలో టీడీపీ వర్గీయులు నాయుడుపేట, సూళ్లూరుపేట, తడ మండలాల నుంచీ భారీ మెజారిటీ అంచనా వేస్తున్నారు. దీనివల్ల కనీసం ఐదారు వేల మెజారిటీతో విజయం సాధిస్తామన్న విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.

తిరుపతి

అభివృద్ధిపై ఆశ పెట్టుకున్న వైసీపీ

తిరుపతిలో జనసేన కూటమి వర్గాలు విజయం తమదేనని ఢంకా భజాయించి మరీ చెబుతున్నాయి. ప్రభుత్వంపై వ్యతిరేకతకు మించి ఆ పార్టీ నాయకులపై స్థానిక ప్రజల్లో వ్యతిరేకత నెలకొందని అంచనాకు వస్తున్నాయి. 20వేల మెజారిటీతో గెలుస్తామని టీడీపీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అధికార పార్టీ విషయానికొస్తే నగరాన్ని అభివృద్ధి చేశామని, కొత్త రోడ్లు వేయడంతో పాటు రోడ్ల విస్తరణ వంటివి ప్రభావం చూపిస్తాయని ఆ పార్టీ వర్గీయులు నమ్ముతున్నారు. స్వల్ప మెజారిటీతో అయినా గెలుపు తీరాన్ని అందుకుంటామని అంచనా వేస్తున్నారు.

సత్యవేడు

స్థానికతదే విజయం అంటున్న టీడీపీ

సత్యవేడులో స్థానిక అభ్యర్థి అన్న అంశం బాగా అనుకూలించిందని టీడీపీ వర్గాలు నమ్ముతున్నాయి. దానికి తోడు మహిళల ఓట్లు అధికంగా తమకే పడ్డాయని, కనీసమంటే 5 వేల నుంచీ 10 వేల ఓట్ల ఆధిక్యతతో విజయాన్నందుకుంటామని చెబుతున్నాయి. ఇక వైసీపీ విషయానికొస్తే ఆర్థిక వనరులు బాగా ఖర్చు పెట్టడంతో పాటు మహిళల ఓట్లు తమకే అధికంగా పడ్డాయని నమ్ముతున్నారు. ఈ రెండు అంశాలూ లాభించడం వల్ల 15 వేల ఆధిక్యతతో గెలుస్తామని అంచనా వేస్తున్నారు.

చంద్రగిరి

పంపకాలపై నమ్మకంతో వైసీపీ

చంద్రగిరి నియోజకవర్గంలో ప్రభుత్వంపై వ్యతిరేకత, ఉద్యోగుల్లో వ్యతిరేకత వంటి సాధారణ అంశాలకు తోడు ఎమ్మెల్యేపై అసంతృప్తితో పలువురు టీడీపీలో చేరడం వంటి అంశాలు తమకు లాభించిందని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. కనీసం 15 వేల మెజారిటీతో గెలుస్తామని అంచనా వేస్తున్నారు. ఇక వైసీపీలో గత పదేళ్ళుగా ఎమ్మెల్యే చెవిరెడ్డి వ్యక్తిగత సేవలు పనిచేస్తాయని, మహిళలు అధికంగా తమకే మద్దతు పలికారని ఆ పార్టీ వర్గాలు నమ్ముతున్నాయి. కనీసం 20 వేల మెజారిటీతో విజయం సాధిస్తామని వారు అంచనాకు వస్తున్నారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



నిఘా నీడలో మహిళా వర్సిటీ

- 500 మీటర్ల వరకు నో వెహికల్ జోన్
- అన్ని వైపులా రోడ్లు దిగ్బంధం

తిరుపతి(నేరవిభాగం), మే 23 : వచ్చే నెల 4వ తేది కౌంటింగు జరగనున్న మహిళా వర్సిటీ వద్ద పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేశారు. టీడీపీ చంద్రగిరి అభ్యర్థి పులివర్తి నానీపై హత్యాయత్నం జరిగిన తర్వాత పోలీసు యంత్రాంగం పూర్తిగా అప్రమత్తమైంది.వర్సిటీకి 500 మీటర్ల పరిధిలో చుట్టు పక్కల రోడ్లు నో వెహికల్ జోన్‌గా వుంచారు. అన్ని ప్రాంతాల్లో పోలీసు బలగాలను ఏర్పాటు చేసారు. వర్సిటీ లోపలికి వెళ్ళే రెండు ప్రధాన గేట్ల వద్ద కేంద్ర బలగాలతో పాటు తిరుపతి శాంతి భద్రతల పోలీసులను నియమించారు. వీరు కాకుండా కేంద్ర బలగాలు 24 గంటలూ గస్తీలో వుండేలా పికెట్లు ఏర్పాటు చేశారు. లోపలికి వెళ్ళే ప్రతి ఒక్కరినీ తనిఖీ చేసి వివరాలను ఎంట్రీబుక్‌లో నమోదు చేస్తున్నారు.చుట్టుపక్కల దుకాణాలు మూసివేయించారు.ద్విచక్ర వాహనాలను సైతం అనుమతించడం లేదు. గాయత్రినగర్, కృష్ణానగర్‌లకు వెళ్ళే అన్ని రోడ్లు మూసివేయడంతో మహిళా వర్సిటీ ప్రాంగణం కర్ఫ్యూ వాతావరణాన్ని తలపిస్తోంది.



మహిళా వర్సిటీ రోడ్డులో మూతబడ్డ షాపులు

ప్రశాంత కౌంటింగ్‌కు పకడ్బందీ చర్యలు

ఎస్పీ హర్షవర్ధనరాజు

తిరుపతి(నేరవిభాగం), మే 23: వచ్చే నెల 4వ తేది జరిగే కౌంటింగు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా పకడ్బందీ చర్యలు చేపట్టామని ఎస్పీ హర్షవర్ధన రాజు చెప్పారు.తిరుపతిలోని పోలీసు పెరేడ్ గ్రౌండులో గురువారం మీడియా సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ ఇప్పటికే 135 ప్రాంతాలను సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించి పికెట్లు ఏర్పాటు చేసామన్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద ఇన్నర్ కారిడార్ వద్ద 500 మీటర్ల పరిధిలో అవుటర్ కారిడార్ వద్ద 2 కిలోమీటర్ల పరిధిలో స్పెషల్ బలగాలను మొహరిస్తున్నామన్నారు. ఎన్నికల కేసులతో సంబంధం వున్న పాత నేరస్తులను అదుపులోకి తీసుకుని కౌన్సిలింగ్ ఇస్తామని అవసరం అనుకుంటే కౌంటింగ్ రోజు పోలీసు స్టేషన్‌లో వుంచుతామన్నారు.

విక్టరీ బార్ నుంచే నానీపై దాడికి పథక రచన

తిరుపతి(నేరవిభాగం), మే 23 : తిరుపతిలోని మహిళా వర్సిటీ వద్ద చంద్రగిరి టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీపై జరిగిన హత్యాయత్నం ఘటనకు సమీపంలోని విక్టరీ బార్ నుంచే పథక రచన చేసినట్లు పోలీసుల దర్యాప్తులో గుర్తించినట్లు సమాచారం. బార్‌లోనే మధ్యాహ్నం ఫుల్‌గా మద్యం సేవించిన నిందితులు అక్కడేదాచి వుంచిన సమ్మెట, రాడ్లు, ఖాళీ బీరు బాటిళ్ళను కారులో వేసుకొచ్చి నానీపై దాడికి ఒడిగట్టినట్లు సమాచారం. దీనిపై అక్కడ వున్న సీసీ పుటేజీ, అరెస్టు అయిన ముద్దాయిలిచ్చిన వాంగ్మూలాల మేరకు ఎస్వీయూనివర్సిటీ పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికే బార్‌లో వున్న సీసీ పుటేజీని స్వాధీనం చేసుకున్న పోలీసులు ఆ రోజు ఎవరెవరు అక్కడకు వచ్చారు..వారికి ఆతిథ్యం ఇచ్చిన వారెవరనే విషయాలపై దర్యాప్తు చేస్తున్నారు.నానీపై హత్యాయత్నం కేసులో అరెస్టయి కడప జైల్లో వున 13మందిలో తిరుమలకు చెందిన హరి, సుధాకర రెడ్డి, రాములు వున్నారు. తిరుమలలో పెయింటర్‌గా పనిచేస్తున్న శ్రీనివాసులుపై దాడి కేసులో ఈ ముగ్గురూ నిందితులు కావడంతో కేసు నమోదు చేసి అందరికీ 41 కింద నోటీసులు ఇచ్చినట్లు తిరుమల టూ టౌన్ సీఐ సత్యనారాయణ సిట్ అధికారులకు వివరించినట్లు తెలిసింది.నానీపై హత్యాయత్నం కేసులో మరికొంతమందిని అరెస్టు చేయడానికి పోలీసులు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

పోలీసు అధికారులకు నోటీసులు

కూచువారిపల్లెవాసులపై కేసులో వివరణ కోరిన ఈసీ

చంద్రగిరి, మే 23: చంద్రగిరి మండలం, కూచువారిపల్లెలో జరిగిన దాడులకు సంబంధించి ఐటీ ఉద్యోగులు, వైద్య వృత్తిలో పనిచేస్తున్న టీడీపీ సానుభూతి పరులపై అక్రమ కేసులు బనాయించారని గ్రామస్తులు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. కూచువారిపల్లెకు చెందిన మహేష్ హైదరాబాదులో, ఎస్.దీపిక తిరుపతిలో వైద్యులుగా పనిచేస్తున్నారు. అదేవిధంగా హైదరాబాదులో హరీష్, వంశీ, బెంగళూరులో బాలాజి, మోహన్, చెన్నైలో ముకేష్, నాగేంద్ర, ఆదర్ష్, శ్రావణి ఐటీ కంపెనీల్లో పనిచేస్తున్నారు. పోలింగ్ రోజున ఓటు హక్కు వినియోగించుకోవడానికి గ్రామానికి వచ్చిన తమపై వైసీపీ ఫిర్యాదుతో పోలీసులు కేసులు బనాయించారని ,దానివల్ల తమ భవిష్యత్తు అంధకారమయ్యే ప్రమాదముందని ఈసీకి ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదుతో స్పందించిన ఎన్నికల కమిషన్ ఈ కేసులపై వివరణ ఇవ్వాలని పోలీసుశాఖకు నోటీసులు జారీ చేసింది.

నేటి నుంచి ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీపరీక్షలు

తిరుపతి(విద్య), మే 23 : ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం నుంచి జూన్ 1వరకు జరగనున్నాయి.జిల్లాలోని 48కేంద్రాల్లో సీసీ కెమరాల నిఘాలో జరిగే ఈ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఆర్‌ఐవో ప్రభాకర రెడ్డి తెలిపారు.ఉదయం 9నుంచి 12గంటల వరకు ప్రథమ సంవత్సర, 2.30-5.30గంటలవరకు ద్వితీయసంవత్సర పరీక్షలు జరుగుతాయని తెలిపారు.ప్రథమ ఇంటర్‌లో 15,880మంది విద్యార్థులు, ద్వితీయలో 2,632మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని తెలిపారు. ఆర్‌ఐవో కార్యాలయంలో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్ ద్వారా ఆన్‌లైన్ స్ట్రీమింగ్‌లో పరీక్షలు జరిగే విధానాన్ని పర్యవేక్షిస్తామని, అవకతవకలకు చోటులేకుండా ఈ పరీక్షలను నిర్వహిస్తామని చెప్పారు. పరీక్షల పర్యవేక్షణకు 2ఫ్లైయింగ్, 4సిట్టింగ్ స్క్వాడ్‌లను నియమించామని వివరించారు.

ఇండస్ట్రియల్ కారిడార్‌లో రోడ్డు నిర్మాణంపై కసరత్తు

శ్రీకాళహస్తి, మే 23 : విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధిలో భాగంగా ఏర్పాటు చేయనున్న రోడ్డు భూసేకరణపై అధికారుల బృందం కసరత్తు చేసింది. తొట్టంబేడు మండలం పొయ్య వద్ద వున్న జాతీయ రహదారి నుంచి బుచ్చినాయుడుకండ్రిగ మండలంలోని పల్లమాల వద్ద తడ రహదారి వరకు ఇండస్ట్రియల్ కారిడార్ రోడ్డును 9.5కి.మీ పొడవు, 45మీటర్ల వెడల్పుతో నాలుగులేన్ల రోడ్డును నిర్మించేందుకు ఇప్పటికే సర్వే పూర్తి చేసిన అధికారులు పలువురికి పరిహారం కూడా అందజేశారు.ఈ నేపథ్యంలో గురువారం ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు, ఆర్అండ్‌బీ, సోషియల్ ఆర్ఆర్ తదితర శాఖల అధికారుల బృందం పొయ్య, గుమ్మడిగుంట, గౌడమాల గ్రామాలతో పాటు బుచ్చినాయుడు కండ్రిగ మండలంలోని కొత్తపాళెం, పల్లమాల గ్రామాల వద్ద పర్యటించారు. రోడ్డు విస్తరణలో భాగంగా నష్టపోయే ఇండ్లను, పంటలను, ప్రభుత్వ ఆస్తులను పరిశీలించారు.అలాగే ఆస్తులు కోల్పోతున్న కుటుంబాల వారితో మాట్లాడారు. భూసేకరణకు సంబంధించిన సమస్యలపై అధ్యయనం చేశారు. రోడ్డు నిర్మాణం పూర్తయిన వెంటనే ఈ ప్రాంతంలో ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా సెజ్ ఏర్పాటవుతుందని తెలిపారు.అధికారులు దేవరాజు, రాంబాబు, గిరీశ్వర్, ఉదయ్‌శంకర్ తదితరులు పాల్గొన్నారు.



పులివర్తి నానీకి పరామర్శ



నానీని పరామర్శిస్తున్న బిరుదాల భాస్కర రెడ్డి తదితరులు

తిరుపతి రూరల్, మే 23: వైసీపీ శ్రేణుల దాడిలో గాయపడిన చంద్రగిరి టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీని రఘునాథ రిసార్ట్స్‌లోని ఆయన స్వగృహంలో గురువారం తుమ్మలగుంట గ్రామానికి చెందిన ఆ పార్టీ రాష్ట్రవాణిజ్య విభాగం ఆర్గనైజింగ్ సెక్రటరీ బిరుదాల భాస్కర్‌రెడ్డి, ఇతర నేతలు కలసి పరామర్శించారు. నేతలు బిరుదాల వేణుగోపాల్‌రెడ్డి, ఓ.కేశవులుశెట్టి, మాజీ ఎంపీటీసీ సరస్వతి, బి.తులసిరామిరెడ్డి, పి.భరత్‌కుమార్‌రెడ్డి, ఎస్.బాలు, చైతన్య, ముని తదితరులు పాల్గొన్నారు.

జనసేన నాయకుల పరామర్శ



తిరుచానూరు, మే 23: వైసీపీ అల్లరి మూకల దాడిలో గాయపడిన చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానీని తిరుపతి జనసేన పార్టీ నాయకులు కిరణ్‌రాయల్, రాజారెడ్డి గురువారం ఆయన స్వగృహంలో కలిసి పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

పులివర్తి నానీని పరామర్శిస్తున్న కిరణ్‌రాయల్, రాజారెడ్డి

సీపీఆర్‌పై నేడు ఉచిత శిక్షణ

తిరుపతి (కల్చరల్), మే 23: తిరుపతి జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో అత్యవసర సమయాల్లో ప్రథమ చికిత్స, సీపీఆర్ నిర్వహణపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం సాయంత్రం 5.30 గంటల నుంచి 8 గంటల వరకు స్థానిక యశోదానగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఇందులో డాక్టర్ వి.చంద్రశేఖర్, ఆర్.రత్నశేఖర్‌లు పాల్గొంటారు. పూర్తి వివరాలకు 74166 66489, 95509 76027 నెంబర్లను సంప్రదించవచ్చు.

కల్యాణ వెంకన్న గరుడోత్సవం



చంద్రగిరి, మే 23: శ్రీనివాసమంగాపురంలో వెలసిన కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం రాత్రి గరుడోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.పౌర్ణమి సందర్భంగా సాయంత్రం స్వామివారి ఉత్సవమూర్తిని పట్టు పీతాంబరాలు, బంగారు ఆభరణాలతో విశేషంగా అలంకరించి గరుడ వాహనంపై ఆలయ మాడ వీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్లు వెంకటస్వామి, మునిచెంగల్రాయులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్, అర్జితం ఇన్‌స్పెక్టర్ అనుంబట్టు ధనశేఖర్, అర్చకులు బాలాజీరంగాచార్యులు, శేషాద్రిచార్యులు, నారాయణచార్యులు, పార్థసారిధి, జమేదార్ చిరంజీవి, సిబ్బంది పాల్గొన్నారు.కాగా కల్యాణ వేంకటేశ్వరస్వామిని గురువారం విశాఖపట్నం శారదా పీఠాధిపతి స్వరూపానందస్వామి దర్శించుకున్నారు.అంతకు ముందు ఆయన తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లలను భవిత కేంద్రంలో చేర్పించండి



ప్రత్యేక అవసరాలున్న పిల్లలతో ఐఈసీ చంద్రశేఖర్‌రెడ్డి

చంద్రగిరి, మే 23: ప్రత్యేక అవసరాలున్న బడి ఈడు పిల్లలను భవిత కేంద్రంలో చేర్పించాలని జిల్లా ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషన్ కో-ఆర్డినేటర్ చంద్రశేఖర్‌రెడ్డి తెలియజేశారు. గురువారం మండంలోని తొండవాడ, చంద్రగిరి పాతపేట, కొత్తపేట తదితర ప్రాంతాలలో ఐఈఆర్‌టీలు చేస్తున్న సర్వేను ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే ద్వారా ప్రత్యేక అవసరాలున్న పిల్లలను గుర్తించి వారిని భవిత కేంద్రంలో చేరుస్తామన్నారు. అంతే కాకుండా ఉచితంగా ఉపకరణాలు, వివిధ అలవెన్సులు, సమగ్ర శిక్ష ద్వారా అందిస్తామని తెలియజేశారు. ఈకార్యక్రమంలో ఐఈఆర్‌టీలు వెంకటరాజేశ్వరి, శ్యామలాదేవి తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



అమ్మవారి ఆలయం వద్ద జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్

తిరుచానూరు, మే 23: తిరుచానూరులోని పద్మావతి అమ్మవారిని గురువారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయం వద్ద డిప్యూటీ ఈవో గోవిందరాజన్ వారికి సంప్రదాయ బద్ధంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. మొదట ధ్వజస్తంభానికి నమస్కరించి తరువాత సన్నిధిలో అమ్మవారి మూలమూర్తిని దర్శించుకున్నారు.

మామిడికాయల మండీ ప్రారంభం

చంద్రగిరి, మే 23: చంద్రగిరి జాతీయ రహదారిలో కాటా వద్ద హేమా ట్రేడర్స్ అధినేత పులిపాటి హేమాద్రి మామిడికాయల మండీని గురువారం ప్రారంభించారు. తమకు మామిడి కాయలు అమ్మిన రైతులకు అప్పటికప్పుడే నగదు చెల్లిస్తామని వివరించారు.

వీరబ్రహ్మేంద్రస్వామికి పుష్పపల్లకి సేవ



రామచంద్రాపురం, మే 23: వీరబ్రహ్మేంద్రస్వామి ఉత్సవాల్లో భాగంగా గంగిరెడ్డిపల్లిలో పౌర్ణమి సందర్భంగా గురువారం వీరబ్రహ్మేంద్రస్వామి పుష్పపల్లకీలో ఊరేగారు. ఆలయాల్లో మూలమూర్తులకు తిరుమంజనం నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేపట్టారు. సాయంత్రం మేళతాళాల నడుమ పుష్పపల్లకీ సేవ చేపట్టారు.

పుష్పపల్లకీలో ఊరేగుతున్న వీరబ్రహ్మేంద్రస్వామి

శాస్త్రోక్తంగా మహాలక్ష్మి హోమం

రామచంద్రాపురం, మే 23: పౌర్ణమి సందర్భంగా రాయలచెరువుకట్ట భవానీ జలకంఠేశ్వరాలయంలో గురువారం మహాలక్ష్మి హోమం నిర్వహించారు. స్వామి వారితో పాటు అమ్మవారికి తిరుమంజనం జరిపించారు. ఉదయం 9గంటలకు యాగశాలలో రుత్వికులు మహాలక్ష్మి యాగం చేపట్టారు. 12గంటలకు పూర్ణాహుతితో ముగించారు.

ప్రత్యామ్నాయ దారితో భక్తుల ఇబ్బందులు

● శ్రీనివాస మంగాపురం - శ్రీవారిమెట్టు మార్గంలో ప్రయాణం నరకం ● పట్టించుకోని టీటీడీ అధికారులు

చంద్రగిరి, మే 23: చంద్రగిరి మండలం శ్రీనివాస మంగాపురం నుంచి శ్రీవారిమెట్టు వెళ్ళడానికి ఏర్పాటు చేసిన ప్రత్యామ్నాయ దారితో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శ్రీనివాసమంగాపురం నుంచి శ్రీవారిమెట్టు వద్దకు వెళ్ళే మార్గంలో రైల్వే మార్గం ఉంది. ఆ రైల్వే మార్గంలో శ్రీనివాస మంగాపురం వద్ద రైల్వేశాఖ అండర్ బ్రిడ్జి నిర్మాణం చేపడుతోంది. దీంతో భక్తులు శ్రీవారిమెట్టు వద్దకు వెళ్ళడానికి కళ్యాణి వాగు నుంచి ప్రత్యామ్నాయ మార్గం ఏర్పాటు చేశారు. ఈ రోడ్డులో నెల రోజులుగా కంకర పోసి, వదిలేయడంతో ఆ దారిలో ద్విచక్ర వాహనాలు, భక్తులు కాలినడకన వెళ్ళాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతిరోజూ శ్రీవారిమెట్టు మార్గంలో వేలాది మంది భక్తులు కాలినడకన తిరుమల శ్రీవారి దర్శనానికి వెళుతుంటారు. ఈ దారిలో ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు వెళ్ళలేక టైర్లు పంక్చర్లు అవుతున్నాయని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కంకర రోడ్డుపై వాహనాలు వెళ్లాలంటే టైర్లు పంక్చర్ అవుతాయని ముందే చెప్పి అద్దె వాహనదారులు అధిక రేట్లు భక్తుల వద్ద వసూలు చేస్తున్నారు. కావున టీటీడీ స్పందించి శ్రీవారిమెట్టు మార్గంలోని ప్రత్యామ్నాయ రోడ్డు నిర్మాణం పూర్తి స్థాయిలో చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.




శ్రీనివాసమంగాపురం నుంచి శ్రీవారిమెట్టుకు వెళ్ళే ప్రత్యామ్నాయ రోడ్డుపై తేలిన కంకర

మహిళలకు రేపట్నుంచీ టైలరింగ్‌పై ఉచిత శిక్షణ

చంద్రగిరి, మే 23: చంద్రగిరి ద్వారకా నగర్‌లోని యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో ఈ నెల 25 నుంచి 30 రోజుల పాటు మహిళలకు టైలరింగ్‌పై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ సురేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. తెల్ల రేషన్ కార్డు కలిగిన తిరుపతి, చిత్తూరు జిల్లాలో గ్రామీణ ప్రాంతానికి చెందిన 19-40 ఏళ్ల మధ్య వయసున్న నిరుద్యోగ మహిళలు ఈశిక్షణకు అర్హులని తెలిపారు. కనీసం పదోతరగతి చదివి ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. శిక్షణ సమయంలో శిక్షణార్థులకు ఉచిత భోజనం సౌకర్యం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 79896 80587, 94949 51289 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

అనామకులను వేధించకండి

● నాపై హత్యాయత్నానికి పాల్పడిన కేసులో సూత్రధారుల సంగతి తేల్చండి
● చంద్రగిరి టీడీపీ అభ్యర్థి పులివర్తి నాని



డీఎస్పీ రవిమనోహరాచ్చారితో మాట్లాడుతున్న నాని

తిరుపతి(నేరవిభాగం), మే 23: ముందస్తు ప్రణాళిక, ఓడిపోతామనే భయంతో వైసీపీ శ్రేణులు కొందరు తనపై హత్యాయత్నానికి పాల్పడ్డారని, ఈ కేసులో అమాయకులను వేధించవద్దని, కర్త, కర్మ, క్రియగా వున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి, వైసీపీ అభ్యర్థి మోహిత్‌రెడ్డి, చెవిరెడ్డి రఘు, భానుకుమార్‌రెడ్డి సంగతి తేల్చాలని డీఎస్పీ రవిమనోహరాచ్చారికి చంద్రగిరి టీడీపీ అభ్యర్థి పులివర్తి నాని ఫిర్యాదు చేశారు. గురువారం సాయంత్రం తిరుపతిలోని ఎస్వీయూనివర్శిటీ పోలీసు స్టేషన్ వద్ద సిట్ అధికారి, తిరుపతి డీఎస్పీ రవిమనోహరాచారిని నానీ కలిశారు. ఈ సందర్భంగా నానీ మాట్లాడుతూ తనపై హత్యాయత్నం జరక్క మునుపు చెవిరెడ్డి, మోహిత్‌రెడ్డి, రఘు, భాను కాల్ డేటా బయట పెట్టాలని కోరారు. వారిని అరెస్టు చేసి విచారణ చేస్తే అసలు విషయాలు బయటకు వస్తాయని డీఎస్పీకి వివరించారు. ఈ ఘటనకు సంబంధం వున్న పోలీసు అధికారులను కూడా విచారించాలని కోరారు. కేసుతో సంబంధంలేని వారి పేర్లు తొలగించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం స్టేషన్ బయట నానీ మీడియాతో మాట్లాడుతూ చెవిరెడ్డికి ఆ పార్టీ నాయకులే దూరమైపోయారనే భయంతో కొంతమంది పేర్లు ఆయనే ఇచ్చి అరెస్టు చేయించారని, వారందరూ అమాయకులేనని చెప్పారు. చంద్రగిరిలో గెలిచేది తానే అని ధీమా వ్యక్తం చేశారు. తన గన్‌మెన్‌కు భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశానన్నారు. ప్రస్తుతం తనకు ప్రభుత్వం కల్పించిన భద్రత బాగుందన్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద అధికారులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారని నాని అభినందించారు. చెవిరెడ్డి కొన్ని పోలింగ్ కేంద్రాల్లో రీపోలింగ్ జరపాలని లేఖ రాసిన విషయమై మీడియా ప్రతినిధులు నాని దృష్టికి తీసుకురాగా, రీపోలింగ్ జరిగితే మా పార్టీకి అరశాతం ఓటింగ్ పెరుగుతుందని ధీమా వ్యక్తం చేశారు. తిరుపతి ఆర్డీవో, రిటర్నింగ్ అధికారిపైనా ఫిర్యాదు చేశామన్నారు.

స్వర్ణరథంపై లోకమాత సాక్షాత్కారం




తిరుచానూరు, మే 23: శ్రీవారి పట్టపురాణి పద్మావతీ దేవి గురువారం ఉదయం స్వర్ణరథంపై కొలువుదీరి మహాలక్ష్మి అలంకరణలో తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు కటాక్షించారు. వసంతోత్సవాల్లో భాగంగా ఉదయం సర్వ అలంకార శోభితురాలైన అమ్మవారి ఉత్సవమూర్తిని స్వర్ణరథంపై కొలువుదీర్చారు. గోవిందా.. గోవిందా...పద్మావతి దేవి పాహిమాం అంటూ భక్తులు పెద్దసంఖ్యలో స్వర్ణరథాన్ని లాగారు.మధ్యాహ్నం అమ్మవారికి ఫ్రైడేగార్డెన్‌లో అభిషేకం చేశారు.రాత్రి బంగారు తిరుచ్చిపై కొలువుదీరి ఆలయ మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. శుక్రవారం జరిగే మహాపూర్ణాహుతితో వసంతోత్సవాలు ముగియ నున్నాయి. డిప్యూటీ ఈవో గోవిందరాజన్, సూపరింటెండెంట్ మధు, శేషగిరి, చంద్రశేఖర్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్, గణేష్, ప్రసాద్, అర్చకులు పాల్గొన్నారు.

తిరుమాడ వీధుల్లో స్వర్ణరథంపై ఊరేగుతున్న పద్మావతిదేవి

నేటినుంచి పాలిసెట్ కౌన్సెలింగ్

తిరుపతి(విద్య), మే 23: పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన ఏపీ పాలిసెట్ కౌన్సెలింగ్ శుక్రవారం నుంచి ప్రారంభంకానుంది.పాలిసెట్ ర్యాంకర్లు 24నుంచి జూన్2లోపు ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాలని తిరుపతిలోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ వై.ద్వారకనాథరెడ్డి సూచించారు.ర్యాంకుల వారీగా 27నుంచి జూన్ 3వతేదీవరకు ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉంటుందని, విద్యార్థులు సంబంధిత ఒరిజనల్ సర్టిఫికెట్లతోపాటు రెండుసెట్ల జిరాక్స్ కాపీలను వెంట తీసుకురావాలని తెలిపారు. మే 31నుంచి జూన్ 5లోపు ఆప్షన్లు నమోదు చేసుకోవాలని, చివరి రోజు ఆప్షన్లలో మార్పులకు, చేర్పులకు అవకాశం ఉందని వివరించారు. జూన్ 7న విద్యార్థుల సెల్‌ఫోన్ నెంబర్లకు సీటు అలాట్‌మెంట్ సమాచారం అందుతుందని, 10నుంచి తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. స్పెషల్ కేటగిరీ విద్యార్థులు (పీహెచ్, సీఏపీ, ఎన్‌సీసీ, స్పోర్ట్స్ అండ్ గేమ్స్)విజయవాడలోని గవర్నమెంట్ పాలిటెక్నిక్‌లో నిర్వహించే కౌన్సెలింగ్‌కి హాజరై తమ ధ్రువపత్రాలను పరిశీలన చేసుకోవాలని సూచించారు. పాలిసెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులు హెచ్‌టీటీపీఎస్://ఏపీపాలిసెట్.ఎన్ఐసీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజును చెల్లించాలన్నారు.

- ర్యాంకులవారీగా ధ్రువపత్రాల పరిశీలన తేదీలు ఇలా: 27న ఒకటినుంచి 12వేలర్యాంకుల వరకు, 28న 12,001-27,000వరకు, 29న 27,001-43,000వరకు, 30న 43,001-59,000వరకు, 31న 59,001-75,000వరకు, జూన్1న 75,001-92,000వరకు, 2న 92,001-108000వరకు, 3న 108001-చివరిర్యాంకు వరకు విద్యార్థులు హాజరై తమ ధ్రువపత్రాలను వెరిఫై చేసుకోవాల్సిఉంది.
- తీసుకురావాల్సిన సర్టిఫికెట్లు ఇవీ: కౌన్సెలింగ్‌కి హాజరయ్యే విద్యార్థులు ప్రాసెసింగ్ ఫీజు పేమెంట్ రశీదు, పాలిసెట్ హాల్‌టికెట్, ర్యాంకు కార్డు, పదవతరగతి/ఈక్వలెంట్ మార్కుల జాబితా, 4నుంచి పదితరగతులవరకు స్టడీ సర్టిఫికెట్స్, కులధ్రువీకరణపత్రం(బీసీ,ఎస్సీ, ఎస్టీ), ఆదాయ ధ్రువీకరణపత్రం, ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్, టీసీలను వెంట తెచ్చుకోవాలి.

కపిలేశ్వరాలయంలో ఘనంగా పుష్పయాగం



తిరుపతి (కల్చరల్) మే 23: తిరుపతి కపిలేశ్వర స్వామి ఆలయంలో గురువారం పత్రపుష్పయాగం వేడుకగా జరిగింది. ఉదయం కపిలేశ్వరస్వామి, కామాక్షి అమ్మవారికి నవకలశ స్నపన తిరుమంజనం నిర్వహించారు. తరువాత 10 గంటల నుంచి 12 గంటల వరకు పత్రపుష్పయాగం జరిగింది. చామంతి, గన్నేరు, మొగిలి, సంపంగి, జాజి, రోజా, తామర, మల్లి వంటి పూలు, తులసి, బిల్వ, పన్నీరు పత్రాలను వినియోగించారు. ఆంధ్ర, తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల నుంచి వచ్చిన 12 రకాల పుష్పాలు, ఆరు రకాల పత్రాలను మొత్తం 3 టన్నుల పూలతో యాగం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో దేవేంద్రబాబు, గార్డెన్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు, ఏఈవో సుబ్బరాజు భక్తులు పాల్గొన్నారు.

గంగమ్మ హుండీ లెక్కింపు

తిరుపతి (కల్చరల్) మే 23: తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతర గత మంగళవారం ముగిసిన నేపథ్యంలో గురువారం ఆలయంలోని హుండీ లెక్కింపు చేపట్టారు. బ్యాంకు అధికారులు, పోలీసులు, పాలకమండలి సభ్యులు, ఆలయ ఉద్యోగుల సమక్షంలో అమ్మవారి ఆలయ హుండీ లెక్కింపు జరిగింది. జాతర సందర్భంగా అమ్మవారికి బంగారం 13.30 గ్రాములు, వెండి 105.386 గ్రాములు, నగదు రూ.37,05,178 ఆదాయం లభించినట్లు ఈవో మమత తెలిపారు.

మంచినీటి కుళాయిల పక్కనే మురుగునీరు

తీవ్ర దుర్వాసనతో ఇబ్బంది పడుతున్న భక్తులు



తిరుమలలో ప్లాస్టిక్ నిషేధమున్న నేపథ్యంలో స్వామి దర్శనానికి వచ్చిన భక్తులు దాహార్తిని తీర్చుకోవాలంటే వివిధ ప్రాంతాల్లో ఉండే జలప్రసాదాలపైనే ఆధారపడాల్సి ఉంటుంది. అయితే ఈ జలప్రసాదాల వద్ద పరిశుభ్రత సక్రమంగా కనిపించడం లేదు. అన్ని ప్రదేశాల్లో చెత్తచెదారం జలప్రసాద కేంద్రాల వద్ద కనిపిస్తోంది. ముఖ్యంగా జీఎన్సీ టోల్‌గేట్ జలప్రసాదం పక్కనే మరుగుదొడ్లు నిర్మించారు. ఈ మరుగుదొడ్ల నుంచి డ్రైనేజ్ పొంగి జలప్రసాద కేంద్రం ముందు పారుతోంది. దీంతో ఆ ప్రాంతమంతా తీవ్రమైన దుర్వాసన వెదజల్లుతోంది. నీటికోసం వచ్చిన భక్తులు ముక్కుమూసుకుని నీరు తాగుతూ, బాటిళ్లలో పట్టుకుంటున్నారు. మరికొంతమంది పక్కనే డ్రైనేజీని చూసి వెనక్కి వెళ్లిపోతున్నారు. అధికారులు ఈసమస్యపై దృష్టిపెట్టాలని భక్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

జీఎన్సీ వద్ద జలప్రసాద కేంద్రం ముందు మరుగుదొడ్ల నుంచి పారుతున్న మురుగు

కుప్పం బాదూరులో జూనియర్ కళాశాల ఏర్పాటు

రామచంద్రాపురం, మే 23: కుప్పం బాదూరు ఉన్నత పాఠశాలలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేసినట్లు ప్రధానోపాధ్యాయురాలు సుజనకుమారి తెలిపారు. రాయలచెరువు, కుప్పంబాదూరు, ప్రసన్న వెంకటేశ్వరపురం గ్రామాల్లో విద్యార్థులను జూనియర్ కళాశాలలో చేర్పించాలని గురువారం ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రజని, సునీత, వాసు, రామమూర్తి, ఉమాశంకర్, శైలేందర్‌రెడ్డి, పీడీ పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

హింసాత్మక ఘటనలకు పాల్పడితే చర్యలు తప్పవు: ఎస్పీ



చుట్టుగుంట రామాపురంలో పర్యటిస్తున్న ఎస్పీ హర్షవర్ధన రాజు

రామచంద్రాపురం, మే 23: సార్వత్రి ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎవరైనా హింసాత్మక ఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హర్షవర్ధన రాజు హెచ్చరించారు. గురువారం రామచంద్రాపురం మండలం చుట్టుగుంట రామాపురం గ్రామాన్ని ఎస్పీ తో పాటు ట్రైనీ ఎస్పీ దేవరాజ్, ఏఎస్పీ కులశేఖర్, డీఎస్పీలు రవీందర్‌రెడ్డి, శరత్‌రాజ్‌కుమార్,ఎస్ఐ చిరంజీవి సందర్శించారు. సమస్యాత్మక కేంద్రాలను గుర్తించి దిగువరామాపురం, ఎగువ రామాపురం గ్రామాల్లో మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. గ్రామాల్లో ఎవరైనా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. రామచంద్రాపురం, ఎస్టీకాలనీ, కమ్మకండ్రిగ కూడలి వరకు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు.

ఓటమి భయంతోనే చెవిరెడ్డి రీపోలింగ్ కోరారు

తిరుచానూరు, మే 23: ఓడిపోతామన్న భయంతోనే చంద్రగిరి నియోజకవర్గంలోని నాలుగు పోలింగ్ కేంద్రాల్లో రీ పోలింగ్ జరపాలని ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి హైకోర్టును ఆశ్రయించారని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని ఆరోపించారు.అయితే ఎన్నికల అధికారులు పోలింగ్‌నాడు ఎలాంటి అవకతవకలు జరగలేదని నివేదిక సమర్పించడంతో చెవిరెడ్డి పిటీషన్‌ను ధర్మాసనం కొట్టివేసిందన్నారు. ఓటమి భయంతోనే దాడులు చేయించడం, అధికారులను బెదిరించడం, రీపోలింగ్ కోరడం చెవిరెడ్డికి పరిపాటిగా మారిందని ఆయన మండిపడ్డారు. పోలింగ్ సజావుగా జరిగేందుకు ఎన్నికల అధికారులు, పోలీసులు పూర్తి సహాయ సహకారాలు అందించారన్నారు.

ప్రారంభమైన ఏనుగుల గణన

మంగళం, మే 23 : ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో ఏనుగుల గణన గురువారం ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరిగే ఏనుగుల గణనకు సంబంధించి ఆయా రాష్ట్రాల అటవీశాఖలు అవసరమైన చర్యలు తీసుకున్నాయి. ఆంధ్ర, తమిళనాడు, కర్ణాటక సరిహద్దులు కుప్పం దగ్గర కలిసి ఉండడంతో మూడు రాష్ట్రాల గజ గణన ఒకేసారి చేపడితే ఖచ్చితమైన సంఖ్య వచ్చే అవకాశం ఉందని భావించి ఈ గజ గణనను చేపడుతున్నారు.గజ గణన చేపడితే ఏ ప్రాంతంలో ఎక్కువ ఏనుగులు ఉన్నాయో తెలుసుకుని వాటికి ఆహారం, తాగునీటి సౌకర్యం కల్పించగలిగితే ఊర్లమీదకు వచ్చే అవకాశం వుండదని అటవీశాఖ అధికారులు భావిస్తున్నారు.మొదటిరోజు జిగ్జాగ్ పద్ధతిలో అన్ని బీట్లను జల్లెడ పట్టారు. రెండవ రోజు ట్రాన్సక్టు లైన్స్‌లో ఏనుగులను గుర్తించడం జరుగుతుంది. మూడవ రోజు అటవీప్రాంతంలో మంచినీటి కుంటలు, చెరువులు ఉండే ప్రాంతాల్లో తనిఖీలు చేస్తారు. తిరుపతి సమీపంలోని శేషాచల అడవుల్లో గురువారం జిగ్జాగ్ పద్ధతిలో సిబ్బంది 22 బీట్లలో ఏనుగుల కోసం ఉదయం 5.30నుంచి సాయంత్రం 6గంటల వరకు గాలించారు. ఓ ప్రాంతంలో ఏనుగుల గుంపు ఉండటాన్ని సిబ్బంది గమనించారు. కానీ దూరంగా ఉండటంతో లెక్కించడం కుదరలేదని అటవీశాఖ అధికారులు తెలిపారు.నేడు, రేపు లెక్కింపు పూర్తయ్యాక,శేషాచల కొండల్లో సేకరించిన ఏనుగుల ఆధారాలను చిత్తూరు డీఎఫ్‌వోకు అందజేస్తామని తెలిపారు. మొత్తం ఏనుగుల సంఖ్య తెలిసేందుకు దాదాపు నెలరోజులు పడుతుందని తెలిపారు.

ఘనంగా వైశాఖిపూర్ణిమ హారతి

తిరుపతి (కల్చరల్) మే 23: మహావిష్ణువుకు ప్రీతికరమైన వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకుని స్థానిక భారతీయ విద్యాభవన్ పాఠశాల ఆవరణలో గురువారం సాయంత్రం కొండహారతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా పాఠశాల అధ్యాపకులు, సిబ్బంది విష్ణుసహస్రనామం, శ్రీనివాస గద్య, లక్ష్మీ అష్టోత్తరం పారాయణ చేశారు. ఉదయం పాఠశాల ఆవరణలో హయగ్రీవ తదితర హోమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భారతీయ విద్యాభవన్ సంచాలకులు డాక్టర్ సత్యనారాయణ రాజు, పంచ సహస్రావధాని మేడసాని మోహన్, ఎస్వీయూ పూర్వ వీసీ ఆచార్య మురళి, తిరుపతి ఎస్‌పీపీ డీఎస్పీ డీకేఎస్. రామచంద్రరాజు, ఆచార్య దక్షిణామూర్తి శర్మ, పాఠశాల కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పురజనులు పాల్గొన్నారు.



తిరుపతి

కాకినాడ-తిరుపతి ఎక్స్‌ప్రెస్ రద్దు

ప్రయాణికులకు ఇక్కట్లు

తిరుపతి(సెంట్రల్), మే 23: కాకినాడ-తిరుపతిల మధ్య రోజు వారి నడుస్తున్న ఎక్స్‌ప్రెస్‌లు (17249-17250) రద్దు కావడంతో సుమారు వెయ్యి మంది ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. విజయవాడ డివిజన్ కేంద్రంలో మరమ్మతులు నిర్వహిస్తున్నందున అధికారులు కాకినాడ ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 30వ తేదీ వరకు రద్దు చేశారు. పిల్లలకు వేసవి సెలవులు వచ్చిన సమయంలో ఈ రైలును రద్దు చేయడంతో తిరుమల పుణ్యక్షేత్రానికి విచ్చేసే ప్రయాణికులు అసౌర్యానికి గురవుతున్నారు. అధికారులు ఈ రైలును ప్రత్యామ్నాయ మార్గమైన గుడివాడ మీదుగా నడిపి తమ కష్టాలు తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

హిసర్-తిరుపతి మధ్య ఎక్స్‌ప్రెస్ రాకపోకల పొడిగింపు

తిరుపతి(సెంట్రల్), మే 23: హిసర్-తిరుపతి మధ్య నడుస్తున్న ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు (09715-09716) జూన్1 నుంచి 29వ తేదీ వరకు రాకపోకలు పొడిగించినట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. వేసవి సెలవుల రద్దీ కారణంగా ఈ ప్రత్యేక రైలును పొడిగిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.17 కోట్లు

తిరుమల, మే 23 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4.17 కోట్లు లభించింది. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ బుధవారం లెక్కించి, గురువారం ఉదయం ప్రకటించింది. బుధవారం 80,048 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 35,403 మంది తలనీలాలు సమర్పించారు.

సమయ పాలన పాటించండి

కార్యాలయ సిబ్బందికి ఎస్పీ సూచన

తిరుపతి(నేరవిభాగం), మే 23: తిరుపతి జిల్లా ఎస్పీ కార్యాలయాన్ని గురువారం ఎస్పీ హర్షవర్ధనరాజు తనిఖీ చేశారు. సిబ్బంది సమయపాలన పాటిస్తున్నారా.. ప్రజలకు జవాబుదారీగా ఉన్నారా అని అడిగి తెలుసుకున్నారు. ప్రధాన విభాగాలైన ఎస్బీ, డీసీఆర్‌బీ, ఎలక్షన్ సెల్, ఏవో కార్యాలయం, ఇతర పరిపాలనా సిబ్బంది సెక్షన్లను ఆయన తనిఖీ చేసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

వాకర్స్‌తో ఆరణి చిట్‌చాట్



తిరుపతి, మే 23 (ఆంధ్రజ్యోతి): జనసేన తిరుపతి ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు గురువారం బైరాగిపట్టెడలోని జగ్జీవన్ రాం పార్కులో వాకర్స్‌తో కలిసి నడిచారు. యువతతో పాటు సీనియర్ సిటిజన్స్‌తో కలసి ఉత్సాహంగా నడిచారు. నడకతో వచ్చే ఆరోగ్యంపై సరదాగా మాట్లాడుకున్నారు. ఎమ్మెల్యేగా గెలిచి మరిన్ని ఉన్నతపదవులు పొందాలని ఈసందర్భంగా పలువురు వాకర్స్ అభిలషించారు. అనంతరం వాకర్స్ అసోసియేషన్ ఏర్పాటుచేసిన మజ్జిగ ప్యాకెట్లను ఆయన పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ఆర్కాట్ కృష్ణ ప్రసాద్, సింగంశెట్టి సుబ్బరామయ్య, రఘు, లీలాకృష్ణమ నాయుడు, జయరాం, చెంగ్రాయులు, గురవయ్య, సుబ్రమణ్యం, రెడ్డయ్య, జమాల్‌వల్లి, కుమారస్వామి నాయుడు, వేణురాయల్, గాలి నందా, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ పెండింగ్ బిల్లుల చెల్లింపునకు కృషి చేయండి

కలెక్టర్‌కు ప్రైవేటు ఆస్పత్రుల విజ్ఞప్తి



కలెక్టర్‌తో మాట్లాడుతున్న ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలు

తిరుపతి(కలెక్టరేట్), మే 23: ఎన్నికల కోడ్‌ను పరిగణనలోకి తీసుకుని ప్రైవేటు ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలను కొనసాగించాలని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ యాజమాన్యాలకు విజ్ఞప్తి చేశారు. గురువారం కలెక్టరేట్‌లో ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలతో కలెక్టర్ సమీక్షించారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ నిలిపివేస్తే రోగులు ఇబ్బందులు పడుతారని, ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని సేవలను కొనసాగించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న ఆరోగ్యశ్రీ బిల్లుల చెల్లింపునకు చర్యలు చేపడుతామని యాజమాన్యాలకు హామీ ఇచ్చారు. ప్రస్తుతానికి ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు ప్రభుత్వం కొంత మొత్తంలో నిధులు విడుదల చేసిందన్నారు. చాలా వరకు ఆరోగ్యశ్రీ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటి చెల్లింపుపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కలెక్టర్‌ను ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలు అభ్యర్థించారు. ఈ సమావేశంలో జిల్లా సమన్వయ అధికారి రాజశేఖర్‌రెడ్డి, ప్రైవేటు ఆస్పత్రుల ఎండీలు డాక్టర్ వెంకటరమణ, సుధారాణి, రమేష్, శివకుమార్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

శెట్టిపల్లి మార్గంలో మతిస్థిమితం లేని వ్యక్తి వీరంగం



మతిస్థిమితం లేని వ్యక్తిని విచారిస్తున్న పోలీసులు

మంగళం, మే 23: మంగళం పరిధిలోని ఆర్టీవో కార్యాలయం సర్కిల్ నుంచి శెట్టిపల్లికి వెళ్లే మార్గంలో మతిస్థిమితం లేని యువకుడు వీరంగం సృష్టించాడు. అటుగా వచ్చే వాహనదారులు, పాదచారులపై రాళ్లు విసిరి దాదాపు 11మందిని గాయపరిచాడు. కొందరు ధైర్యం చేసి అతడిని పట్టుకుని తాళ్లతో కట్టేసి పోలీసులకు అప్పగించారు.

స్వర్ణ పతకాలు సాధించిన తిరుపతి క్రీడాకారులు



తిరుపతి(క్రీడలు), మే 23: తిరుపతికి చెందిన యువ క్రీడాకారులు కరాటే పోటీల్లో సత్తాచాటి స్వర్ణ పతకాలను సాధించారు. గత ఆదివారం గోవాలో జరిగిన జాతీయస్థాయి కరాటే పోటీల్లో స్థానిక బైరాగిపట్టెడలోని కెన్‌బుకాయ్ సిటోరియా స్కూల్లో శిక్షణ పొందిన సోనిక, వర్ణిక, వెంకట్, సుజిత, సూర్య, లోకేశ్వర్‌రెడ్డి, ధనుష్, రవీంద్ర, కిరణ్‌కుమార్‌లు పాల్గొన్నారు. ప్రతిభచాటిన వీరు స్వర్ణ పతకాలు, సర్టిఫికెట్లను కైవసం చేసుకున్నారు. అత్యుత్తమంగా రాణించిన సోనిక, వర్ణిక, సూర్యలు వచ్చేనెల 16నుంచి 20రోజుల పాటు జరిగే అంతర్జాతీయ కరాటే శిక్షణకు ఎంపికయ్యారు. క్రీడాకారులను, శిక్షకుడు రత్నాకర్‌ను రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్, కె.ఎన్.రాజ, సుబ్రహ్మణ్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



11వ వార్డు కౌన్సిలర్ దొడ్డారెడ్డి ప్రవల్లికారెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా గురువారం శుభాకాంక్షలు తెలియజేస్తున్న తిరుపతి నగర మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, కౌన్సిలర్ ఎస్కే బాబు, దొడ్డారెడ్డి శంకరరెడ్డి, ఉప్పలపాటి సాయి చౌదరి తదితరులు

కమనీయం.. గోవిందుడి రథోత్సవం



తేరుపై గోవిందుడి విహారం







అశ్వ వాహనసేవ

తిరుపతి(కల్చరల్), మే 23: గోవింద నామస్మరణ మధ్య ఆలయ మాడవీధులు మార్మోగుతుండగా.. అశేష భక్తజనం మోకులతో దేవదేవుడి రథం లాగుతుండగా.. తిరుపతి నగరం గురువారం ఉదయం పులకించింది. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా తిరుపతిలోని గోవిందరాజస్వామి రథోత్సవం ఉదయం 6.30 నుంచి 9 గంటల మధ్య జరిగింది. తేరు వీధి నుంచి బయలు దేరిన స్వామి వారి రథం అటు కర్నాల వీధి, బేరి వీధి, గాంధీ రోడ్డు మీదుగా మళ్లీ తేరువీధిలోని ఉత్తర మాడవీధి సమీపంలో తన స్థానానికి చేరుకోవడంతో దర్శించిన భక్తులు పారవశ్యంతో గోవిందా.. గోవిందా అంటు పెద్ద పెట్టున నినదించారు. అడుగడుగునా స్వామి వారికి హారతులిస్తూ, అర్చకస్వాముల దీవెనలందుకుంటూ... రథంపై ఉప్పు, మిరియాలు చల్లుతూ భక్తిని చాటుకున్నారు. భక్తుల సౌకర్యం కోసం టీటీడీ మంచి నీరు, మజ్జిగ పంపిణీ చేసింది. మాడవీధుల్లోని స్థానికులు కూడా శక్తిమేరకు నీళ్లు, మజ్జిగ వితరణ చేశారు. రాయలసీమ రంగస్థలి నిర్వాహకులు గుండాల గోపినాథ్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, నైనారు శ్రీనివాసులు, తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి తదితరులు తేరు వీధిలో భక్తులకు అరటి పళ్లు పంపిణీచేశారు. రథోత్సవం కారణంగా మాడవీధుల్లో ఉదయం 6 నుంచి 11 గంటల వరకు విద్యుత్‌కోత విధించారు. పోలీసులు అనేక కూడళ్లవద్ద ట్రాఫిక్ నియంత్రణ చేపట్టారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వామి ఉత్సవమూర్తులకు ఆలయంలో వైభవంగా స్నపన తిరుమంజనం జరిగింది. సాయంత్రం స్వామి వారికి ఊంజల్ సేవ జరిగింది. రాత్రి 7 గంటలకు స్వామి వారు అశ్వ వాహనంపై కల్కి అవతారంలో గోవిందరాజులు మాడవీధుల్లో భక్తులకు కనువిందు చేశారు. వాహనసేవ ముందు వేదపండితులు, జియ్యరు స్వాములు స్వామివారిని కీర్తిస్తూ కదిలారు. మాడవీధుల్లో ప్రదర్శించిన వివిధ కళారూపాలు, నృత్యాలు, కోలాటాలు భక్తులను విశేషంగా ఆకర్షించాయి. ఈ కార్యక్రమంలో పెద్దజీయరుస్వామి, చిన్నజీయరు స్వామి, ఎఫ్ఏ అండ్ సీఏవో బాలాజీ, సీఈ నాగేశ్వరరావు, ఆగమ సలహాదారు సీతారామాచార్యులు, మోహన రంగాచార్యులు, డిప్యూటీ ఈవో శాంతి, ఏఈవో మునికృష్ణారెడ్డి, ధనంజయ పాల్గొన్నారు.

నేడు చక్రస్నానం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా 24వ తేదీ శుక్రవారం ఉదయం 8 నుంచి 9.30 గంటలమధ్య కపిలతీర్థంలో చక్రస్నానం వైభవంగా నిర్వహిస్తారు. అనంతరం స్వామి వారు పీఆర్ తోటకు వేంచేపు చేస్తారు. అక్కడ సాయంత్రం 6 గంటల వరకు విశ్రాంతి తీసుకుని, తిరిగి ఆలయానికి చేరుకుంటారు.





కౌంటింగ్‌లో సమస్యలు ఏర్పడకుండా చూడండి

- అధికారులకు ఆరణి శ్రీనివాసులు సూచన



కౌంటింగ్ కేంద్రం లోపలికి వెళ్లే ముందు గేటు వద్ద సెక్యూరిటీ రిజిస్టర్ బుక్‌లో సంతకం చేస్తున్న ఆరణి శ్రీనివాసులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 23: జూన్ 4వ తేదీన చేపట్టే కౌంటింగ్‌లో ఎలాంటి సాంకేతిక సమస్యలు ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కూటమి తిరుపతి ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు సూచించారు. మహిళా యూనివర్సిటీలోని స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాన్ని ఆయన గురువారం పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కౌంటింగ్ సమయంలో శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా చూడాలని కోరారు. స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాల వద్ద భద్రతను పటిష్టంగా నిర్వహించాలన్నారు. పోలింగ్ ఏజెంట్లను వైసీపీ నాయకులు బెదిరిస్తున్నారని ఆయన ఆరోపించారు. అధికార యంత్రాంగం కౌంటింగ్‌ను నిష్పక్షపాతంగా నిర్వహించాలని కోరారు. తప్పుడు వార్తలను ప్రచారం చేస్తున్న వారిపై సైబర్ క్రైం అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జనరల్ ఏజెంట్ మహేష్ యాదవ్ పాల్గొన్నారు.

విధ్వంసకర ఘటనలను ఎదుర్కోవడంపై పోలీసుల మాక్ డ్రిల్





మాక్ డ్రిల్‌లో భాగంగా ఇంటి పట్టాలు ఇవ్వాలని ఆందోళన చేస్తున్న ప్రజలు - అదుపుచేస్తున్న పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), మే 23: కౌంటింగ్ రోజు అల్లరి మూకలు పాల్పడే విధ్వంసాలు, అల్లర్లు, ఇతరత్రా ఘటనలు జరిగితే ఎలా ఎదుర్కోవాలనే అంశాలపై తిరుపతి పోలీసు పెరేడ్ గ్రౌండులో గురువారం ఎస్పీ హర్షవర్ధనరాజు నేతృత్వంలో పోలీసులు మాక్ డ్రిల్ నిర్వహించారు. కలెక్టర్ కార్యాలయం వద్ద ఇంటి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ప్రజలు పెద్ద ఎత్తున ఆందోళన చేయడం, కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించడానికి వెళుతున్న ఆందోళనకారులను పోలీసులు ఎలా ఎదుర్కోవాలి... మాబ్ పెద్ద ఎత్తున గుమికూడి చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని సంఘ విద్రోహక శక్తులు పాల్పడే విధ్వంసకర ఘటనలను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి పోలీసులు అన్ని విధాలా సిద్ధంగా ఉన్నారనే విషయాన్ని ప్రజలు, ట్రబుల్ మాంగర్స్‌కు తెలియజేయడానికి మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీలు కులశేఖర్, శ్రీనివాసులు, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనం కల్పిస్తామంటూ

టీటీడీ కాంట్రాక్ట్ ఉద్యోగుల మోసం

తిరుమల, మే 23 (ఆంధ్రజ్యోతి): టీటీడీలో కాంట్రాక్ట్ పద్ధతిన పనిచేసే ముగ్గురు తూర్పుగోదావరి జిల్లా భక్తులను శ్రీవారి దర్శనం కల్పిస్తామంటూ మోసగించారు. విజిలెన్స్ అధికారుల కథనం మేరకు.. తిరుపతికి చెందిన పూల శేఖర్, అమృత్‌యాదవ్, వినోద్ శ్రీలక్ష్మీ శ్రీనివాస మ్యాన్‌పవర్ కార్పొరేషన్ ద్వారా తిరుమలలోని వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లో కౌంటర్ బాయ్స్‌గా పనిచేస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లా రామచంద్రాపురానికి చెందిన శివరామకృష్ణ కిషోర్ వద్ద ఐదు గురికి శ్రీవారి దర్శనం కల్పిస్తామంటూ రూ.20 వేలు తీసుకున్నారు.తీరా భక్తులు వచ్చాక దర్శనం కల్పించకపోవడంతో శివరామకృష్ణ కిషోర్ విజిలెన్స్ వింగ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో విజిలెన్స్ అధికారులు ఆ ముగ్గురితో పాటు వారి కుటుంబసభ్యుల బ్యాంక్ లావాదేవీలను పరిశీలించారు.కొద్ది నెలలుగా దర్శనాలు, గదులు, ప్రసాదాల పేరుతో దాదాపు రూ.50 లక్షలు తీసుకున్నట్టు విజిలెన్స్ విచారణలో తేలింది.ఈ ముగ్గురిలో ఒకరు ప్రభుత్వ రెవిన్యూ కార్యాలయంలో కూడా పనిచేస్తూ తిరుమలలో అక్రమాలకు పాల్పడినట్టు సమాచారం.పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వీరికి ఎవరు సహకరిస్తున్నారనే అంశంపై విచారిస్తున్నారు.

ఘనంగా అన్నమయ్య జయంతి వేడుకలు





అన్నమయ్య ప్రాజెక్టు కళాకారుల గోష్టిగానం - గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్, బుల్లెమ్మ గానం

తిరుపతి (కల్చరల్), మే 23: శ్రీవారి పరమ భక్తుడు, పదకవితా పితామహుడు అన్నమయ్య 616వ జయంతి వేడుకలు గురువారం ఉదయం స్థానిక అన్నమాచార్య కళామందిరంలో వేడుకగా ప్రారంభమయ్యాయి. ఉదయం 9 గంటలకు అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులచే సంకీర్తన గోష్టి గానం నిర్వహించారు. ఇందులో బ్రహ్మకడిగిన పాదము, కొండలలో నెలకొన్న, నారాయణతే నమో, ఎంతమాత్రమున, హరి అవతారమితడు వంటి అన్నమయ్య కీర్తనలను గాయకులు వీనుల విందుగా గానం చేశారు. సాయంత్రం పడలి ఫణి నారాయణ బృందం సంగీత సభ, రాత్రి గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్, బుల్లెమ్మ బృందం కచేరీ ఆహూతులను అలరించింది. ఈ కార్యక్రమంలో అన్నమాచార్య ప్రాజెక్టు అధికారిణి కోకిల, తదితరులు పాల్గొన్నారు. శుక్రవారం నుంచి 29వ తేదీ వరకు ఉదయం 10 గంటల నుంచి సాహిత్య సభలు, రాత్రి సంగీత సభలు జరుగుతాయి.

కౌంటింగ్‌కు సహకరించాలి

అభ్యర్థులకు కలెక్టర్ విజ్ఞప్తి



అభ్యర్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

తిరుపతి(కలెక్టరేట్), మే 23: జిల్లాలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా, ప్రశాంతంగా జరిగేందుకు అన్ని రాజకీయ పార్టీల అభ్యర్థులు సహకరించాలని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. గురువారం కలెక్టరేట్‌లో సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మహిళా విశ్వవిద్యాలయంలో జూన్ 4న మూడంచెల భద్రత మధ్య కౌంటింగ్ ప్రక్రియ నిర్వహిస్తామన్నారు. కౌంటింగ్ కేంద్రం లోపలికి సెల్‌ఫోన్, ఎలక్ట్రానిక్ గాడ్జెట్లకు అనుమతి లేదన్నారు. ఎవరైనా హింసాత్మక ఘటనలకు పాల్పడితే కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈవీఎంల కౌంటింగ్ ప్రక్రియ 14 టేబుళ్ల ఏర్పాటుతో గూడూరు 21 రౌండ్లు, సూళ్లూరుపేట 22, వెంకటగిరి 22, తిరుపతి 20, శ్రీకాళహస్తి 21, సత్యవేడు 20, చంద్రగిరికి మాత్రం 20 టేబుళ్ల ఏర్పాటుతో కౌంటింగ్ జరుగుతుందని ఆయన చెప్పారు. సర్వేపల్లికి సంబంధించి ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాలలో అబ్జర్వర్ పర్యవేక్షణలోనే కౌంటింగ్ జరుగుతుందన్నారు. తిరుపతి పార్లమెంటుకు 19,017 పోస్టల్ బ్యాలెట్లు ఉన్నాయని తెలిపారు. డీఆర్వో పెంచలకిషోర్, పోటీ చేసిన రాజకీయ పార్టీల నేతలు ఉన్నారు.

కౌంటింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

తిరుపతి జిల్లాలో ఓట్ల లెక్కింపునకు మహిళా యూనివర్శిటీలో పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టామని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ రాష్ట్ర ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. గురువారం విజయవాడ నుంచి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా వర్చువల్ విధానంలో కౌంటింగ్ ప్రక్రియపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ వివరిస్తూ.. కౌంటింగ్ ప్రక్రియకు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తయ్యాయని, పోస్టల్ బ్యాలెట్‌కు 15 టేబుళ్లతో మూడు రౌండ్లలో పూర్తి చేసేలా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. జూన్ 4వ తేదీ సాయంత్రం 4గంటల లోపు పోస్టల్‌బ్యాలెట్‌తోపాటు ఈవీఎం ఓట్ల లెక్కింపు ఫలితాలు వెల్లడించడానికి ఏర్పాట్లు చేశామన్నారు.

భ్రూణ హత్యలను అరికట్టండి

తిరుపతి(కలెక్టరేట్), మే 23: జిల్లాలో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టం కఠినంగా అమలు చేసి ఉల్లంఘనలకు పాల్పడిన వారిపై తీవ్రమైన చర్యలను చేపట్టాలని వైద్య ఆరోగ్యశాఖను కలెక్టర్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో లింగనిర్ధారణ చట్టం అమలుపై అడ్వైజరీ కమిటీతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో స్త్రీ, పురుషులు ఇద్దరు సమానమేనని, ఆడపిల్లల పట్ల వివక్షత ఉండకూడదన్నారు. ప్రతి నెలా అన్ని స్కానింగ్ కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించి, చట్టాన్ని ఉల్లంఘించిన స్కానింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో శ్రీహరి, డీఐవో శాంతికుమారి, డీఎస్పీ కాటమరాజు, వైద్యులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
తిరుపతి - 9160195583, 9703618708
9703618705, 9703618710
9985411629, 9985410347, 9985411003
చిత్తూరు - 9985411584, 9985403122
మదనపల్లె - 9985417476, 9848161191
కుప్పం - 9985403032 పలమనేరు - 9985403032
పుంగనూరు - 9985403204, పీలేరు - 9985403045
పుత్తూరు - 9985411598, శ్రీకాళహస్తి - 9985411596

WANTED
Rtd. Employee /VRS మరియు Qualified సీనియర్ సిటిజన్స్‌కి సువర్ణ అవకాశం. తిరిగి మీ పూర్వ వైభవాన్ని పునర్నిర్మించడం కొరకు సం.ప్ర. KUBER RESIDENCY, TPT. 89784 71248
AJT-3050

WANTED
తిరుపతిలో వివిధ బ్రాంచీలు గల హోటల్ (లాడ్జ్) నందు పనిచేయుటకు రూమ్ బాయ్స్ (10), హౌస్ కీపింగ్(6), వాచ్ మెన్లు (3) కావలెను. Cell: 7093956342
AJT-1899

రాజస్థాన్ రైలు యాత్ర
దసరా సందర్భంగా రాజస్థాన్ రైలుయాత్ర తేది:01-10-24. 11రోజులు టిక్ 21,000/- (భోజనం, ACరూం+ ACబస్సు) కె.వాసు నెల్లూరు. సం.ప్ర. సెల్: 94913 40504
AJR-178309

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(ట్రైనిడ్ పోలీస్ డిపార్టుమెంట్) గోల్డ్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర: 7382114647
AJA-177000

పాఠకులకు ముఖ్యగమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడీవీటీ

ప్రశాంత కౌంటింగ్‌కు సహకరించాలి

● అభ్యర్థులకు కలెక్టర్ విజ్ఞప్తి

తిరుపతి(కలెక్టరేట్), మే 23: జిల్లాలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా, ప్రశాంతంగా జరిగేందుకు అన్ని రాజకీయ పార్టీల అభ్యర్థులు సహకరించాలని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. గురువారం కలెక్టరేట్‌లో సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మహిళా విశ్వవిద్యాలయంలో జూన్ 4న మూడంచెల భద్రత మధ్య కౌంటింగ్ ప్రక్రియ నిర్వహిస్తామన్నారు. కౌంటింగ్ కేంద్రం లోపలికి సెల్‌ఫోన్, ఎలక్ట్రానిక్ గాడ్జెట్లకు అనుమతి లేదన్నారు. ఎవరైనా హింసాత్మక ఘటనలకు పాల్పడితే కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈవీఎంల కౌంటింగ్ ప్రక్రియ 14 టేబుళ్ల ఏర్పాటుతో గూడూరు 21 రౌండ్లు, సూళ్లూరుపేట 22, వెంకటగిరి 22, తిరుపతి 20, శ్రీకాళహస్తి 21, సత్యవేడు 20, చంద్రగిరికి మాత్రం 20 టేబుళ్ల ఏర్పాటుతో కౌంటింగ్ జరుగుతుందని ఆయన చెప్పారు. సర్వేపల్లికి సంబంధించి ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాలలో అబ్జర్వర్ పర్యవేక్షణలోనే కౌంటింగ్ జరుగుతుందన్నారు. తిరుపతి పార్లమెంటుకు 19,017 పోస్టల్ బ్యాలెట్లు ఉన్నాయని తెలిపారు. ఈ సమావేశంలో డీఆర్వో పెంచలకిషోర్, పోటీ చేసిన రాజకీయ పార్టీల నేతలు ఉన్నారు.

సాయంత్రం 4గంటల లోపు ఫలితాల వెల్లడి

తిరుపతి జిల్లాలో ఓట్ల లెక్కింపునకు మహిళా యూనివర్శిటీలో పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టామని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ రాష్ట్ర ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. గురువారం విజయవాడ నుంచి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనా వర్చువల్ విధానంలో కౌంటింగ్ ప్రక్రియపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ వివరిస్తూ.. కౌంటింగ్ ప్రక్రియకు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తయ్యాయని, పోస్టల్ బ్యాలెట్‌కు 15 టేబుళ్లతో మూడు రౌండ్లలో పూర్తి చేసేలా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. జూన్ 4వ తేదీ సాయంత్రం 4గంటలలోపు పోస్టల్‌బ్యాలెట్‌తోపాటు ఈవీఎం ఓట్ల లెక్కింపు ఫలితాలు వెల్లడించడానికి ఏర్పాట్లు చేశామన్నారు.

భ్రూణ హత్యలను అరికట్టండి

తిరుపతి(కలెక్టరేట్), మే 23: జిల్లాలో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టం కఠినంగా అమలు చేసి ఉల్లంఘనలకు పాల్పడిన వారిపై తీవ్రమైన చర్యలను చేపట్టాలని వైద్య ఆరోగ్యశాఖను కలెక్టర్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో లింగనిర్ధారణ చట్టం అమలుపై అడ్వైజరీ కమిటీతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో స్త్రీ, పురుషులు ఇద్దరు సమానమేనని, ఆడపిల్లల పట్ల వివక్షత ఉండకూడదన్నారు. ప్రతి నెలా అన్ని స్కానింగ్ కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించి, చట్టాన్ని ఉల్లంఘించిన స్కానింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో శ్రీహరి, డీఐవో శాంతికుమారి, డీఎస్పీ కాటమరాజు, వైద్యులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ పెండింగ్ బిల్లుల చెల్లింపునకు కృషి చేయండి

● కలెక్టర్‌కు ప్రైవేటు ఆస్పత్రుల విజ్ఞప్తి

తిరుపతి(కలెక్టరేట్), మే 23: ఎన్నికల కోడ్‌ను పరిగణనలోకి తీసుకుని ప్రైవేటు ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలను కొనసాగించాలని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ యాజమాన్యాలకు విజ్ఞప్తి చేశారు. గురువారం కలెక్టరేట్‌లో ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలతో కలెక్టర్ సమీక్షించారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ నిలిపివేస్తే రోగులు ఇబ్బందులు పడుతారని, ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని సేవలను కొనసాగించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న ఆరోగ్యశ్రీ బిల్లుల చెల్లింపునకు చర్యలు చేపడుతామని యాజమాన్యాలకు హామీ ఇచ్చారు. ప్రస్తుతానికి ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు ప్రభుత్వం కొంత మొత్తంలో నిధులు విడుదల చేసిందన్నారు. చాలా వరకు ఆరోగ్యశ్రీ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటి చెల్లింపుపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కలెక్టర్‌ను ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలు అభ్యర్థించారు. ఈ సమావేశంలో జిల్లా సమన్వయ అధికారి రాజశేఖర్‌రెడ్డి, ప్రైవేటు ఆస్పత్రుల ఎండీలు డాక్టర్ వెంకటరమణ, సుధారాణి, రమేష్, శివకుమార్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన ఏనుగుల గణన

మంగళం, మే 23 : ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో ఏనుగుల గణన గురువారం ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరిగే ఏనుగుల గణనకు సంబంధించి ఆయా రాష్ట్రాల అటవీశాఖలు అవసరమైన చర్యలు తీసుకున్నాయి. ఆంధ్ర, తమిళనాడు, కర్ణాటక సరిహద్దులు కుప్పం దగ్గర కలిసి ఉండడంతో మూడు రాష్ట్రాల గజ గణన ఒకేసారి చేపడితే ఖచ్చితమైన సంఖ్య వచ్చే అవకాశం ఉందని భావించి ఈ గజ గణనను చేపడుతున్నారు.గజ గణన చేపడితే ఏ ప్రాంతంలో ఎక్కువ ఏనుగులు ఉన్నాయో తెలుసుకుని వాటికి ఆహారం, తాగునీటి సౌకర్యం కల్పించగలిగితే ఊర్లమీదకు వచ్చే అవకాశం వుండదని అటవీశాఖ అధికారులు భావిస్తున్నారు.మొదటిరోజు జిగ్జాగ్ పద్ధతిలో అన్ని బీట్లను జల్లెడ పట్టారు. రెండవ రోజు ట్రాన్సక్టు లైన్స్‌లో ఏనుగులను గుర్తించడం జరుగుతుంది. మూడవ రోజు అటవీప్రాంతంలో మంచినీటి కుంటలు, చెరువులు ఉండే ప్రాంతాల్లో తనిఖీలు చేస్తారు. తిరుపతి సమీపంలోని శేషాచల అడవుల్లో గురువారం జిగ్జాగ్ పద్ధతిలో సిబ్బంది 22 బీట్లలో ఏనుగుల కోసం ఉదయం 5.30నుంచి సాయంత్రం 6గంటల వరకు గాలించారు. ఓ ప్రాంతంలో ఏనుగుల గుంపు ఉండటాన్ని సిబ్బంది గమనించారు. కానీ దూరంగా ఉండటంతో లెక్కించడం కుదరలేదని అటవీశాఖ అధికారులు తెలిపారు. నేడు, రేపు లెక్కింపు పూర్తయ్యాక, శేషాచల కొండల్లో సేకరించిన ఏనుగుల ఆధారాలను చిత్తూరు డీఎఫ్‌ఏవోకు అందజేస్తామని తెలిపారు. మొత్తం ఏనుగుల సంఖ్య తెలిసేందుకు దాదాపు నెలరోజులు పడుతుందని తెలిపారు.

ఘనంగా అన్నమయ్య జయంతి వేడుకలు

తిరుపతి (కల్చరల్) మే 23: శ్రీవారి పరమ భక్తుడు, పదకవితా పితామహుడు అన్నమయ్య 616వ జయంతి వేడుకలు గురువారం ఉదయం స్థానిక అన్నమాచార్య కళామందిరంలో వేడుకగా ప్రారంభమయ్యాయి. ఉదయం 9 గంటలకు అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులచే సంకీర్తన గోష్ఠి గానం నిర్వహించారు. ఇందులో బ్రహ్మకడిగిన పాదము, కొండలలో నెలకొన్న, నారాయణతే నమో, ఎంతమాత్రమున, హరి అవతారమితడు వంటి అన్నమయ్య కీర్తనలను గాయకులు వీనుల విందుగా గానం చేశారు. సాయంత్రం పదలి ఫణి నారాయణ బృందం సంగీత సభ, రాత్రి గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్, బుల్లెమ్మ బృందం కచేరీ ఆహూతులను అలరించింది. ఈ కార్యక్రమంలో అన్నమాచార్య ప్రాజెక్టు అధికారిణి కోకిల, తదితరులు పాల్గొన్నారు. శుక్రవారం నుంచి 29వ తేదీ వరకు ఉదయం 10 గంటల నుంచి సాహిత్య సభలు, రాత్రి సంగీత సభలు జరుగుతాయి.

కపిలేశ్వరాలయంలో ఘనంగా పుష్పయాగం

తిరుపతి (కల్చరల్) మే 23: తిరుపతి కపిలేశ్వరస్వామి ఆలయంలో గురువారం పత్రపుష్పయాగం వేడుకగా జరిగింది. ఉదయం కపిలేశ్వరస్వామి, కామాక్షి అమ్మవారికి నవకలశ స్నపన తిరుమంజనం నిర్వహించారు. తరువాత 10 గంటల నుంచి 12 గంటల వరకు పత్రపుష్పయాగం జరిగింది. చామంతి, గన్నేరు, మొగిలి, సంపంగి, జాజి, రోజా, తామర, మల్లి వంటి పూలు, తులసి, బిల్వ, పన్నీరు పత్రాలను వినియోగించారు. ఆంధ్ర, తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల నుంచి వచ్చిన 12 రకాల పుష్పాలు, ఆరు రకాల పత్రాలను మొత్తం 3 టన్నుల పూలతో యాగం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో దేవేంద్రబాబు, గార్డెన్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు, ఏఈవో సుబ్బరాజు భక్తులు పాల్గొన్నారు.

కాకినాడ-తిరుపతి ఎక్స్‌ప్రెస్ రద్దుతో ఇక్కట్లు

తిరుపతి(సెంట్రల్), మే 23: కాకినాడ-తిరుపతిల మధ్య రోజు వారి నడుస్తున్న ఎక్స్‌ప్రెస్‌లు (17249-17250) రద్దు కావడంతో సుమారు వెయ్యి మంది ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. విజయవాడ డివిజన్ కేంద్రంలో మరమ్మతులు నిర్వహిస్తున్నందున అధికారులు కాకినాడ ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 30వ తేదీ వరకు రద్దు చేశారు. పిల్లలకు వేసవి సెలవులు వచ్చిన సమయంలో ఈ రైలును రద్దు చేయడంతో తిరుమల పుణ్యక్షేత్రానికి విచ్చేసే ప్రయాణికులు అసౌర్యానికి గురవుతున్నారు. అధికారులు ఈ రైలును ప్రత్యామ్నాయ మార్గమైన గుడివాడ మీదుగా నడిపి తమ కష్టాలు తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

హిసర్-తిరుపతి ఎక్స్‌ప్రెస్ రాకపోకల పొడిగింపు

హిసర్-తిరుపతి మధ్య నడుస్తున్న ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్ల (09715-09716) జూన్1 నుంచి 29వ తేదీ వరకు రాకపోకలు పొడిగించినట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. వేసవి సెలవుల రద్దీ కారణంగా ఈ ప్రత్యేక రైలును పొడిగిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

సమయ పాలన పాటించండి

కార్యాలయ సిబ్బందికి ఎస్పీ సూచన

తిరుపతి(నేరవిభాగం), మే 23: తిరుపతి జిల్లా ఎస్పీ కార్యాలయాన్ని గురువారం ఎస్పీ హర్షవర్ధనరాజు తనిఖీ చేశారు. సిబ్బంది సమయపాలన పాటిస్తున్నారా.. ప్రజలకు జవాబుదారీగా ఉన్నారా అని అడిగి తెలుసుకున్నారు. ప్రధాన విభాగాలైన ఎస్బీ, డీసీఆర్‌బీ, ఎలక్షన్ సెల్, ఏవో కార్యాలయం, ఇతర పరిపాలనా సిబ్బంది సెక్షన్లను ఆయన తనిఖీ చేసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

మలుపుల్లో స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు చేయరూ...!

గూడూరు, మే 23: పట్టణంలోని పలు ప్రాంతాల్లోని కూడళ్లలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రధాన మార్గంలో వాహనాల రద్దీ పెరగడంతో కూడళ్ల వద్ద వేగంగా వచ్చే వాహనాల కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయంటున్నారు. పట్టణంలో ఆర్టీసీ బస్టాండు నుంచి శాంతినగర్ అండర్‌బ్రిడ్జి వరకు గల ప్రధానరహదారి మార్గంలో పలు కూడళ్లు, మలుపులున్నాయి. పట్టణంలో వాహనాల సంఖ్య పెరిగింది. దీంతోపాటు వివిధ పనులపై సమీప గ్రామాల నుంచి ప్రజలు వాహనాల్లో పట్టణానికి వస్తుంటారు. కూడళ్ల వద్ద, మలుపుల వద్ద వేగ నిరోధకాలను ఏర్పాటు చేయకపోవడంతో వేగాన్ని నియంత్రించలేక ప్రమాదాలకు లోనవుతున్నారు. సంగం థియేటర్ సెంటర్‌లో, కుమ్మరవీధి సెంటర్‌లో నాలుగు రోడ్లు కలిసే చోట, ఏరియా ఆసుపత్రి సమీపంలో, పాతబస్టాండుకు వెళ్లే మార్గంలో, రైల్వేస్టేషన్ మీదుగా వివేకానందరోడ్డులోకి వెళ్లే మార్గంలోని మలుపు వద్ద, శాంతినగర్ అండర్‌బ్రిడ్జి సమీపంలోని మలుపు వద్ద వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఈ ప్రాంతాల్లో వేగనిరోధకాలు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ప్రాంతాల్లో వేగంగా వచ్చే వాహనాలను తప్పించుకుని రోడ్డు దాటాలంటే ఇబ్బందికరంగా మారిందని పాదచారులు చెబుతున్నారు. రోడ్డు దాటే సమయంలో వాహనాలు ఢీకొని పాదాచారులు గాయపడిన సంఘటనలున్నాయి.ఆయా ప్రాంతాల్లో అధికారులు స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు చేయాల్సి ఉంది.





పాతబస్టాండు వద్ద మలుపు - ప్రమాదకరంగా ఉన్న సంఘంథియేటర్ సెంటర్‌లోని కూడలి

నలభై ఏళ్ల విద్యుత్ సమస్యకు మోక్షం

చెందోడు సబ్ డివిజన్ ఏడీ చొరవ ● సరఫరా అంతరాయానికి పరిష్కారం

చిట్టమూరు, మే 23: చెందోడు (కోట) సబ్‌డివిజన్ పరిధిలో నలభై ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని విద్యుత్ సరఫరా అంతరాయానికి చెందోడు సబ్‌డివిజన్ ఏడీ చొరవతో పరిష్కారమైంది. పకృతి వైపరీత్యాల కారణంగా చిన్నపాటి గాలి వీచినా విద్యుత్ సరఫరా నిలిచిపోయేది. అంతేకాక పాత విద్యుత్ తీగలకు ఏర్పాటు చేసిన జంపర్లు తెగిపోవడం, ఇన్సులేటర్లు పగిలిపోయేవి. దీంతో విద్యుత్ శాఖ సిబ్బంది వర్షాకాలంలో పడే కష్టాలు వర్ణనాతీతం. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకొని స్పందించిన ఏడీ వరప్రసాద్‌రెడ్డి చిట్టమూరు మండల ట్రాన్స్‌కో సిబ్బంది, షిఫ్ట్ ఆపరేటర్లు, బిల్లింగ్ సిబ్బంది సుమారు వంద మందితో మరమ్మతులకు శ్రీకారం చుట్టారు. చిట్టమూరు మండలంలోని కొత్తగుంట, మల్లాం, యల్లసిరి, గొట్టిప్రోలు, ఏకసిరి సబ్‌స్టేషన్‌ల వద్ద ఫీడర్లకు మరమ్మతులు చేపట్టారు. అదేవిధంగా లైన్ మీద దెబ్బతిన్న జంపర్లు, ఇన్సులేటర్లు మార్చుకుంటూ వస్తున్నారు. పలు చోట్ల వదులుగా ఉన్న విద్యుత్ తీగలను లాగి కట్టారు. కోగిలి, మల్లాం, ఆరూరు, ఏకసిరి, గునపాడు, పెళ్లకూరు, బురదగాలి కొత్తపాళెం గ్రామాల్లో పనులు పూర్తి చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో దెబ్బతిన్న విద్యుత్ లైన్లు మరమ్మతులు చేపట్టామని, ప్రధాన కూడళ్లలో రోడ్డుకు అడ్డంగా వాహనాలకు తగులుతున్న లైన్లు ఎత్తు పెంచుతామని ఏడీ తెలిపారు. విద్యుత్ నిర్వహణ పనుల్లో ఇన్‌చార్జి ఏఈ పోలయ్య, లైన్‌ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెన్, సిబ్బంది పాల్గొన్నారు.



కోగిలి సమీపంలో విద్యుత్ లైన్లు సరి చేస్తున్న సిబ్బంది

దడ పుట్టిస్తున్న వీధికుక్కలు

గూడూరు, మే 23: పట్టణంలోని పలు ప్రాంతాల్లో వీధి కుక్కలు స్థానికులకు దడ పుట్టిస్తున్నాయి. వీధికుక్కల నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో వాటి సంచారం పెరిగిపోయింది. దీంతో రాత్రి, వేకువ సమయాలలో వీధుల్లో తిరగాలంటే స్థానికులు హడలిపోతున్నారు. వేసవి సెలవులు కావడంతో చిన్నారులు వీధులలో ఆటలు ఆడుకునే సమయంలో, ట్యూషన్ల నుంచి ఇంటికి వెళ్లే సమయంలో కుక్కలు తరుము కుంటుండడంతో భయాందోళన చెందుతున్నారు. వాకింగ్ వెళ్లే వారు కూడా ఇబ్బంది పడుతున్నారు. వాహనాల్లో వెళ్ళే సమయంలో తరుముకుంటూ పైకి వస్తుండడంతో ప్రమాదాలకు లోనవుతున్నామని వాహనచోదకులు చెబుతున్నారు. బ్యాగులతో రైల్వేస్టేషన్, బస్టాండులకు వెళ్లాలన్నా కుక్కలు వెంటబడుతున్నాయని చెబుతున్నారు. ప్రధానంగా పాతబస్టాండు, టవర్‌క్లాక్ సెంటర్, ఐసీఎస్ రోడ్డు, మసీదువీధి, అశోక్‌నగర్, మాళవ్యానగర్, గాంధీనగర్ తదితర ప్రాంతాల్లో వీధికుక్కల బెడద ఎక్కువగా ఉందని స్థానికులు చెబుతున్నారు. ఇటీవల మసీదువీధికి చెందిన ఆరేళ్ల చిన్నారి రాత్రి సమయంలో శివాలయం వీధిలో ఆటలాడుకుని ఇంటికి వెళుతుండగా ఓ వీధికుక్క దాడి చేయడంతో గాయాలపాలైంది. స్టేడియంలో వాకింగ్ చేస్తున్న సమయంలో ఓ వ్యక్తి వెనుకకు నడుస్తుండంగా ఓ కుక్క కరిచింది. గతంలో మున్సిపల్ అధికారులు వీధికుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోనేవారన్నారు. గతంలో తిరుపతికి చెందిన ఓ ప్రైవేటు సంస్థ సహకారంతో వీధి కుక్కలను పట్టుకుని వాటికి సంతానోత్పత్తి నిలిచిపోయేలా ఇంజెక్షన్లు వేసి తిరిగి వదిలివేసేవారు. దీంతో వీధికుక్కల పెరుగుదల కొంతమేర తగ్గేది. మూడేళ్లకుపైగా వీధికుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టలేదని అంటున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి వీధికుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



చిన్నారులపై వీధికుక్క దాడి

తడ, మే 23 : ఏడాదిన్నర చిన్నారిపై వీధికుక్క దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. తడ కండ్రిగ పంచాయతీ సుబ్రహ్మణ్యం, నివి దంపతుల కుమారుడు నందా గురువారం సాయంత్రం ఇంటి ముందర ఆడుకుంటుండగా అటుగా వెళ్తున్న వీధికుక్క దాడి చేసింది. దీంతో చిన్నారికి తీవ్రగాయాలు అయ్యాయి. వెంటనే తల్లిదండ్రులు బాలుడిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అలాగే అక్కడ కొద్ది దూరంలో నడిచి వెళ్తున్న ఐదేళ్ల బాలుడిపై సైతం ఆ కుక్క దాడి చేసింది.





కమనీయం ....రథోత్సవం

తిరుపతి(కల్చరల్) మే 23: గోవింద నామ స్మరణ మధ్య ఆలయ మాడవీధులు మార్మోగుతుండగా.. అశేష భక్తజనం మోకులతో దేవదేవుడి రథం లాగుతుండగా.. తిరుపతి నగరం గురువారం ఉదయం పులకించింది. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా తిరుపతిలోని గోవిందరాజస్వామి రథోత్సవం ఉదయం 6.30 నుంచి 9 గంటల మధ్య జరిగింది. తేరు వీధి నుంచి బయలు దేరిన స్వామి వారి రథం అటు కర్నాల వీధి, బేరి వీధి, గాంధీ రోడ్డు మీదుగా మళ్లీ తేరువీధిలోని ఉత్తర మాడవీధి సమీపంలో తన స్థానానికి చేరుకోవడంతో దర్శించిన భక్తులు పారవశ్యంతో గోవిందా.. గోవిందా అంటు పెద్ద పెట్టున నినదించారు. రథంపై ఉప్పు, మిరియాలు చల్లుతూ భక్తిని చాటుకున్నారు.రథోత్సవం కారణంగా మాడవీధుల్లో ఉదయం 6 నుంచి 11 గంటల వరకు విద్యుత్‌కోత విధించారు. పోలీసులు అనేక కూడళ్లవద్ద ట్రాఫిక్ నియంత్రణ చేపట్టారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వామి ఉత్సవమూర్తులకు ఆలయంలో వైభవంగా స్నపన తిరుమంజనం జరిగింది. సాయంత్రం స్వామి వారికి ఊంజల్ సేవ జరిగింది. రాత్రి 7 గంటలకు స్వామి వారు అశ్వవాహనంపై కల్కి అవతారంలో గోవిందరాజులు మాడవీధుల్లో భక్తులకు కనువిందు చేశారు. వాహనసేవముందు వేదపండితులు, జియ్యరు స్వాములు స్వామివారిని కీర్తిస్తూ కదిలారు. మాడవీధుల్లో ప్రదర్శించిన వివిధ కళారూపాలు ఆకర్షించాయి.

నేడు చక్రస్నానం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం 8 నుంచి 9.30 గంటలమధ్య కపిలతీర్థంలో చక్రస్నానం వైభవంగా నిర్వహిస్తారు. అనంతరం స్వామి వారు పీఆర్ తోటకు వేంచేస్తారు. అక్కడ సాయంత్రం 6 గంటల వరకు విశ్రాంతి తీసుకుని, తిరిగి ఆలయానికి చేరుకుంటారు.

మోహినీ అలంకారంలో చెన్నకేశవస్వామి



గూడూరు, మే 23: పట్టణంలోని కర్నాలవీధిలో కొలువై ఉన్న భూదేవి, శ్రీదేవి సమేత చెన్నకేశవ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో గురువారం స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. చెన్నకేశవస్వామిని మోహినీగా అలంకరించి తిరువీధి ఉత్సవం జరిపారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

నేత్రపర్వంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

చిల్లకూరు, మే 23: మండలంలోని కలవకొండపై కొలువై ఉన్న లక్ష్మీనరసింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామి,అమ్మవార్ల కల్యాణం వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ కన్నులపండువగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి గజవాహనంపై అధిష్ఠింపజేసి విశేషపూజలు జరిపారు. అన్నదానం జరిగింది. భక్తులు స్వామివారి కల్యాణాన్ని తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం స్వామిఅమ్మవార్లను ఆలయం సమీపంలో ఊరేగించారు.



తాళిబొట్టును చూపుతున్న వేదపండితులు

ద్వారదర్శనం అపూర్వం

గరుడవాహన సేవ నేత్రపర్వం

నాయుడుపేట, మే 23 : నాయుడుపేట తుమ్మూరులోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కరిమాణిక్యస్వామి దేవస్థానంలో తిరుమల, తిరుపతి దేవస్థానాల వేదపండితుల మంత్రోచ్చరణలనడుమ, మంగళవాయిద్యాలతో అత్యంత వైభవంగా బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగం గురువారం దేవస్థానంలో ద్వారదర్శనానికి భక్తులు విరివిగా దర్శనం చేసుకున్నారు. రాత్రి గరుడవాహనంపై కరిమాణిక్యస్వామి నగరోత్సవంలో భక్తులు పాల్గొన్నారు. ఉభయకర్తలుగా పోచారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, రమాదేవి దంపతులు వ్యవహరించారు.



అభయశంకరుడిఆలయంలో పౌర్ణమి వేడుకలు



సూళ్లూరుపేట, మే 23: పట్టణంలోని టీడీపీ కార్యాలయ సమీపంలో ఉన్న అభయ శంకరుడి ఆలయంలో గురువారం పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకం నిర్వహించి పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామి వారిని దర్శించుకొన్నారు. ఈ సందర్భంగా భక్తులకు మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆకుతోట రమేష్, మేడా సాయి, గండవరం రమేష్ రెడ్డి, నాపా మునిరాజా తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా చండీయాగం



చండీయాగం అనంతరం పూర్ణాహుతిని తీసుకెళ్తున్న ఉభయకర్తలు

సూళ్లూరుపేట, మే 23: తెలుగు, తమిళ భక్తుల ఆరాధ్య దైవమైన చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయంలో గురువారం మహా చండీయాగాన్ని శాస్త్రోకతంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని యాగశాల మండపంలో అమ్మవారి ఉత్సవ విగ్రహం ఏర్పాటు చేసి వేదపండితుల, మంత్రోచ్చాటన నడుమ యాగాన్ని నిర్వహించారు. ఉభయకర్తలుగా తడ మండల బీవీపాలెం మాజీ సర్పంచ్ గోవిందరాజులు దంపతులు వ్యవహరించారు. యాగం అనంతరం ఉభయకర్తలను వేదపండితులు ఆశీర్వదించి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

బౌద్ధమతంపై నమ్మకం పెరుగుతోంది



బుద్ధుడు, అంబేద్కర్‌కు నివాళి అర్పిస్తున్న ప్రతినిధులు

కోట, మే 23: ప్రస్తుత తరంలో బౌద్ధ మతంపై నమ్మకం పెరుగుతోందని పలువురు బౌద్ధ మతస్తులు, అంబేడ్కరిస్టులు అన్నారు. కోటలోని మహాత్మాజ్యోతిబా ఫూలే నగర్‌లో గురువారం బహుజన ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుద్ధజయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయా ప్రతినిధులు, మత మార్పిడి చేసుకున్నవారు బుద్ధ, అంబేద్కర్ విగ్రహాలకు నివాళి అర్పించారు. ఆనాడు బుద్ధుడు బౌద్ధ మతాన్ని ప్రారంభించాడని, అది మహావృక్షంలా పెరుగుతూ ప్రపంచం నలుమూలల వేగంగా వ్యాప్తి చెందిందన్నారు. అందరూ కలసి కట్టుగా ఉండి బుద్ధుడి ఆశయాలను ప్రజల్లోకి తీసుకువెళ్దామన్నారు ఐక్యవేదిక ప్రతినిధులు దాసరి సుందరం, మీజూరు మాధవ్, డాక్టర్ రవికుమార్, బలరామయ్య, రంగయ్య, అశోక్‌కాంబ్లే తదితరులు ఉన్నారు.

గరుడ వాహనంపై చెన్నకేశవుడి రాజసం



శ్రీకాళహస్తి, మే 23: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఊరందూరులో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి గురువారం పౌర్ణమిని పురస్కరించుకుని గరుడ వాహనంపై గ్రామ వీధుల్లో ఊరేగారు. చెన్నకేశవ స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మొదట స్వామి అమ్మవార్లకు విశేష అభిషేకాలు నిర్వహించి అలంకరించారు. ధూప, దీపనైవేద్యాలు సమర్పించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్చరణల మధ్య స్వామి, అమ్మవార్లు గరుడ వాహనంపై గ్రామ వీధుల్లో ఊరేగారు. భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో పాలకమండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, పాలకమండలి సభ్యులు ఆలయ అధికారులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఉచిత చదరంగ శిక్షణ

శ్రీకాళహస్తి, మే 23: పట్టణంలోని కొత్తపేటలో గల జడ్పీ బాలికోన్నత పాఠశాలలో 5-15లోపు వయసు గల వారికి శనివారం నుంచి జూన్ 2వ తేదీ వరకు ఉచిత చదరంగ శిక్షణ ఇవ్వనున్నట్లు ది చిల్డ్రన్ చెస్ అసోసియేషన్ నిర్వాహకులు అంజూరు బాలసుబ్రహ్మణ్యం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు ఈ శిక్షణ ఉంటుందన్నారు. చివరి రెండురోజులు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తామని వివరించారు. శిక్షణకు వచ్చే వారు తమ వెంట చదరంగ బోర్డు, కాయిన్స్, నోట్‌బుక్, పెన్, పెన్సిల్, రెడ్‌పెన్ తీసుకురావాలని సూచించారు.

శాస్త్రోక్తంగా గురుదక్షిణామూర్తికి పూజలు



శ్రీకాళహస్తి, మే 23: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మేథో గురుదక్షిణామూర్తికి గురువారం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ముందుగా కలశ ప్రతిష్ఠ ఏర్పాటు చేశారు. అనంతరం వినాయక పూజ, కలశ పూజ నిర్వహించారు. అనంతరం స్వామివారికి పాలు, పెరుగు, పంచామృతం, చందనం, నారికేళ జలాలతో వైభవంగా అభిషేకం నిర్వహించారు. సుగంధ పూలు, స్వర్ణాభరణాలతో విశేషంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. పర్వత హారతి, చక్ర హారతి, కుంభ హారతి, మహామంగళ హారతులు ఇచ్చారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో పాలకమండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, వేదపండితులు, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షా శిబిరానికి విశేష స్పందన



రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఏర్పేడు, మే 23: ఏర్పేడు మండలం ఎండీ పుత్తూరులో సర్పంచ్ మోహన ప్రియ ఆధ్వర్యంలో శ్రీబాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ స్విమ్స్ ఆస్పత్రి సౌజన్యంతో గురువారం ఉదయం నుంచి నిర్వహించిన క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షల శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో మేమోగ్రామ, అల్ట్రా స్కానింగ్, పేపస్మియర్ తదితర క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. సుమారు 70మంది పరీక్షలు చేయించుకున్నారని వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్రవంతి, రేడియాలజిస్టు డాక్టర్ పూజ, ప్రజాసంబంధాల అధికారి చంద్రమోహన్, టెక్నీషియన్లు, నరసింగ్ సిబ్బంది, ఎంపీటీసీ పద్మమ్మ, ఉప సర్పంచ్ గౌరి, పంచాయతీ కార్యదర్శి లోకముని, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గిరిజన వృద్ధులకు పింఛన్లు ఇవ్వాలి

వరదయ్యపాళెం, మే 23: మండలంలోని సీఎల్ఎన్‌పల్లి, రాళ్లపాడు, రాచెర్ల, కళత్తూరు గిరిజన కాలనీల వృద్ధులకు సప్తగిరి గ్రామీణ బ్యాంకు అధికారులు ప్రభుత్వం నుంచి వచ్చిన వృద్ధాప్య పింఛన్లు, అమ్మఒడి తదితర డబ్బులను వెంటనే ఇవ్వాలని సీపీఐ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి అంబాకం చిన్నిరాజ్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల డబ్బులు ఇవ్వకుండా రకరకాల కారణాలతో బ్యాంకుల చుట్టూ తిప్పించుకుంటున్నారని ఆరోపించారు. వెంటనే వారి డబ్బులు వారికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాచెర్ల, కళత్తూరు, సీఎల్ఎన్ పల్లి, రాళ్లపాడు గ్రామాల గిరిజనులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు



వరదయ్యపాళెం, మే23: మండలంలోని చిన్నపాండూరులో గల శ్రోత్రియ భూములను స్థానికేతరులు ఆక్రమిస్తూ పాకలు వేసుకోవడంపై రెవన్యూ అధికారులు స్పందించారు. తహసీల్దారు ఉదయభారతి ఆదేశాల మేరకు ఆర్ఐ వేణు గోపాల్, వీఆర్వో చలపతి ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది గురువారం అక్రమంగా వేసిన పాకలను తొలగించారు. శ్రోత్రియ భూములలో కొన్నాళ్ల క్రితం షికారీలు తమ ఇంటి స్థలాలు కేటాయించాలని కోరుతూ అక్రమంగా పాకలు వేసుకున్నారు. ఇదిలాఉండగా షికారీలకు నాయకత్వం వహిస్తున్న కొందరు స్థానికేతరుల నుంచి ఓ ప్లాట్‌కు రూ.30వేల వరకు తీసుకుని అనుమతి ఇవ్వడంతో కొందరు పాకలు వేసుకున్నారు. సమాచారం అందుకున్న వీఆర్వో తహసీల్దారుకు ఫిర్యాదు చేయడంతో ఆమె ఆదేశాల మేరకు అక్రమంగా వేసిన పాకలను తొలగించారు.

నేటినుంచి పాలిసెట్ కౌన్సెలింగ్

తిరుపతి(విద్య), మే 23: పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన ఏపీ పాలిసెట్ కౌన్సెలింగ్ శుక్రవారం నుంచి ప్రారంభంకానుంది. పాలిసెట్ ర్యాంకర్లు 24నుంచి జూన్2లోపు ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాలని తిరుపతిలోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ వై.ద్వారకనాథరెడ్డి సూచించారు.ర్యాంకుల వారీగా 27నుంచి జూన్ 3వతేదీవరకు ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉంటుందని, విద్యార్థులు సంబంధిత ఒరిజనల్ సర్టిఫికెట్లతోపాటు రెండుసెట్ల జిరాక్స్ కాపీలను వెంట తీసుకురావాలని తెలిపారు. మే 31నుంచి జూన్ 5లోపు ఆప్షన్లు నమోదు చేసుకోవాలని, చివరి రోజు ఆప్షన్లలో మార్పులకు, చేర్పులకు అవకాశం ఉందని వివరించారు. జూన్ 7న విద్యార్థుల సెల్‌ఫోన్ నెంబర్లకు సీటు అలాట్‌మెంట్ సమాచారం అందుతుందని, 10నుంచి తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. స్పెషల్ కేటగిరీ విద్యార్థులు(పీహెచ్, సీఏపీ, ఎన్‌సీసీ, స్పోర్ట్స్ అండ్ గేమ్స్)విజయవాడలోని గవర్నమెంట్ పాలిటెక్నిక్‌లో నిర్వహించే కౌన్సెలింగ్‌కి హాజరై తమ ధ్రువపత్రాలను పరిశీలన చేసుకోవాలని సూచించారు. పాలిసెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులు హెచ్‌టీటీపీఎస్://ఏపీపాలిసెట్.ఎన్ఐసీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ప్రాసెసింగ్ ఫీజును చెల్లించాలన్నారు.

ర్యాంకులవారీగా ధ్రువపత్రాల పరిశీలన తేదీలు ఇలా: 27న ఒకటి నుంచి 12వేలర్యాంకుల వరకు, 28న 12,001-27,000వరకు, 29న 27,001-43,000వరకు, 30న 43,001-59,000వరకు, 31న 59,001-75,000వరకు, జూన్1న 75,001-92,000వరకు, 2న 92,001-108000వరకు, 3న 108001-చివరిర్యాంకు విద్యార్థులు హాజరై ధ్రువపత్రాలను వెరిఫై చేసుకోవాల్సిఉంది.

తీసుకురావాల్సిన సర్టిఫికెట్లు ఇవీ: కౌన్సెలింగ్‌కి హాజరయ్యే విద్యార్థులు ప్రాసెసింగ్ ఫీజు పేమెంట్ రశీదు, పాలిసెట్ హాల్‌టికెట్, ర్యాంకు కార్డు, పదవతరగతి/ఈక్వలెంట్ మార్కుల జాబితా, 4నుంచి పదితరగతులవరకు స్టడీ సర్టిఫికెట్స్, కులధ్రువీకరణపత్రం(బీసీ,ఎస్సీ,ఎస్టీ), ఆదాయ ధ్రువీకరణపత్రం, ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్, టీసీలను వెంట తెచ్చుకోవాలి.

శ్రీకాళహస్తి

సత్యవేడు

భక్తులకు అన్నదానం



ఏర్పేడు, మే 23: మండలంలోని మర్రిమందలో వెలసిన లక్ష్మీహయగ్రీవ స్వామి ఆలయం వద్ద గురువారం భక్తులకు అన్నదానం చేశారు. పౌర్ణమి సందర్భంగా సుమారు 300 మంది భక్తులకు అన్నదానం చేశారు.

టపాకాయల దుకాణం సీజ్



వడమాలపేట, మే 23: వడమాలపేటలో పర్మినెంట్ లైసెన్స్ కలిగిన కార్తికేయ క్రాకర్స్ దుకాణాన్ని గురువారం తహసీల్దార్ రాజసింహ సీజ్ చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గురువారం దుకాణంలో స్టాక్‌ను పరిశీలించి కలెక్టర్ ఉత్తర్వుల మేరకు సీజ్ చేస్తున్నట్లు తెలిపారు. జూన్ 4వ తేదీన కౌంటింగ్ అనంతరం ఏ పార్టీ నాయకులు, అభిమానులు, టపాకాయలు కాల్చరాదని హెచ్చరించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని చెప్పారు.

ధ్యానం, యోగాపై శిక్షణ



వరదయ్యపాళెం, మే 23: ధ్యానం, యోగా ప్రతి ఒక్కరి జీవితంలో ఒక భాగం కావాలని లోకా ఫౌండేషన్ లోకేష్ దాసాజీ అన్నారు. గురువారం వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకుని వరదయ్యపాళెం పంచాయతీ గోవర్ధనపురంలోని వెన్నెస్ కార్యాలయంలో లోక ఫౌండేషన్ ఆధ్వర్యంలో ధ్యానం, యోగాపై ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో పీఆర్వో బొప్పన రమేష్, సునీల్, ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ చెక్ పవర్ రద్దు చేయాలి

రేణిగుంట, మే 23: రేణిగుంట పంచాయతీలో ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా ఎన్నికలు ముందు రోజు ఓటర్లను ప్రభావితంచేసిన స్థానిక సర్పంచ్ చెక్ పవర్ రద్దు చేయాలని గురువారం ఎంపీడీవో విష్ణుచిరంజీవికి స్థానిక వార్డు మెంబర్లు ఎంజీరెడ్డి, విజయలక్ష్మి వినతిపత్రం అందజేశారు. పంచాయతీలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై జాయింట్ కలెక్టర్ చేత విచారణ చేయించాలని డిమాండ్ చేశారు.

నాడు-నేడు పనులను వేగవంతం చేయండి

బుచ్చినాయుడుకండ్రిగ, మే 23: మండలంలో జరుగుతున్న నాడు-నేడు రెండోవ విడత పనులను వేగవంతం చేసి, పూర్తిచేయాలని ఎంఆవోలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం కోరారు. మండల విద్యాశాఖ కార్యాలయంలో గురువారం ప్రధానోపాధ్యాయులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో నాడు-నేడు రెండో విడతలో 22 పాఠశాలల్లో రూ.6కోట్లతో పనులు జరుగుతున్నాయని చెప్పారు.

కేవీబీపురంలో జోరుగా వరినాట్లు



కేవీబీపురం, మే 23: మండలంలో వరినాట్లు జోరందుకున్నాయి. చెరువుల కింద, బోర్ల కింద వరినాటే రైతులు ముమ్మరంగా వరినాట్లు వేస్తున్నారు. ముఖ్యంగా అంజూరు చెరువు ఆయకట్టు కింద ఆ పరిసర ప్రాంతాల్లో బోర్లు ఉన్న కళత్తూరు, పెరిందేశం, రాయపేడు గ్రామాల్లో ఈ వరినాట్లు జోరందుకున్నాయి. ప్రస్తుతానికి చెరువులు, కింద బోర్లు కింద సుమారు 500 ఎకరాల వరకు వరిసాగు చేస్తున్నారు.

సమస్యాత్మక ప్రాంతాల్లో పటిష్ట భద్రతా చర్యలు

ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

రేణిగుంట, మే 23: సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి పటిష్ఠమైన భద్రతా చర్యలు చేపడుతామని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తెలిపారు. గురువారం సాయంత్రం రేణిగుంట పట్టణంలోని డీఎస్పీ అర్బన్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. పోలీస్‌స్టేషన్ భవనం మర్మమతులకు గురి కావడాన్ని ఎస్పీ గమనించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ రోజు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులకు సూచించారు. మండలంలో సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి అక్కడ ప్రత్యేక బందోబస్తు నిర్వహిస్తామన్నారు. వివిధ రాజకీయ పార్టీల నేతలతో ముందస్తు సమావేశం ఏర్పాటు చేసి ఎన్నికల కౌంటింగ్‌రోజు సహకరించే విధంగా చర్యలు చేపడుతామన్నారు. ఎవరైనా హద్దు మీరితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



రేణిగుంట పోలీస్‌స్టేషన్‌లో ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

వేణుగోపాలపురంలో పోలీసుల కార్డన్ సెర్చ్



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

రేణిగుంట, మే 23: పట్టణంలోని వేణుగోపాలపురంలో గురువారం తెల్లవారుజామున పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఎన్నికల కౌంటింగ్ రోజు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రతలు చేపట్టాలని ప్రజలకు సూచించారు. అలాగే ఆ ప్రాంతంలో ఉన్న అనుమానితులను విచారించారు. సరైన ధ్రువీకరణ పత్రాలులేని 8 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమలో రేణిగుంట సబ్‌డివిజన్ పోలీసులు, అర్బన్ పోలీసులు పాల్గొన్నారు.

మృతి చెందిన కార్మికుడి కుటుంబానికి న్యాయం చేయండి



కార్మికుడికి న్యాయం చేయాలంటూ నిరసన వ్యక్తం చేస్తున్న సహచరులు

శ్రీకాళహస్తి, మే 23: విధుల్లో గుండెపోటుతో మృతి చెందిన తమ తోటి కార్మికుడికి న్యాయం చేయాలంటూ సహచరులు డిమాండ్ చేశారు. ఈ ఘటన శ్రీకాళహస్తి పట్టణశివారులోని కాగితాలపురం వద్ద చోటు చేసుకుంది. ఓ ప్రైవేటు రోడ్డు నిర్మాణ సంస్థ కాగితాలపురం వద్ద కార్యాలయం ఏర్పాటు చేసుకుని కొద్ది సంవత్సరాలుగా కార్యకలాపాలు సాగిస్తోంది. ఒడిస్సాకు చెందిన చంద్రశేఖర్ మోటీ(52) అనే టిప్పర్ డ్రైవర్ గుండెపోటుతో వాహనంలోనే బుధవారం రాత్రి కుప్పకూలాడు. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సహజమరణం కావడంతో నిర్మాణ సంస్థ యాజమాన్యం మృతుడి కుటుంబానికి నష్టపరిహారం విషయంలో తర్జనభర్జన పడింది. అయితే సంస్థలో పనిచేసే కార్మికులంతా ఒకటై చంద్రశేఖర్ మోటీకి న్యాయం చేయాలని పట్టుపట్టారు. గురువారం ఉదయం అందరూ విధులు బహిష్కరించారు. వెంటనే స్పందించిన యాజమాన్యం మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం చేస్తామని ప్రకటించడంతో సమస్య సద్దుమణిగింది.

సింహ, ముత్యపు పందిరి వాహనాలపై కల్యాణ వెంకన్న





సింహ వాహనం, ముత్యపు పందిరి వాహనాలపై కల్యాణ వెంకన్న

నారాయణవనం, మే 23: శ్రీపద్మావతీ దేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం ఉదయం స్వామివారు సింహవాహనంపై, రాత్రి ముత్యపు పందిరి వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామివారిని విశేషంగా అలంకరించి సింహ వాహనంపై అధిష్ఠించారు. మేళతాళాలు, వేదమంత్రాలు, డప్పుల వాయిద్యాలు, గోవిందనామ స్మరణల నడుమ స్వామివారిని గ్రామ వీధుల్లో ఊరేగించారు. ఆలయానికి చేరుకున్న స్వామి ఉభయనాంచారులతో స్నపన తిరుమంజనంలో పాల్గొన్నారు. సాయంత్రం స్వామివారు అర్జునుడికి గీతాపదేశం బోధిస్తున్న కృష్ణుడి అవతారంలో దర్శనం ఇచ్చారు. రాత్రి7.30 గంటలకు ముత్యపు పందిరి వాహనంపై ఊరేగుతూ దర్శనమి చ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో పార్థసారథి,సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయాధికారి నాగరాజు, ప్రధాన అర్చకులు శ్రీధర్ భట్టాచార్య, శ్రీనివాస భట్టాచార్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

నాగలాపురం, మే 23: మండలంలోని కృష్ణాపురం వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఇందులో ఒకరి పరిస్థితి విషమంగా మారింది. మండల పరిధిలోని వినోభానగర్ గ్రామానికి చెందిన మోహన్, బాబు గురువారం మధ్యాహ్నం బైక్‌పై బయటకు వెళ్లి తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా మార్గమధ్యం కృష్ణాపురం వద్ద ఎదురుగా వస్తున్న కంటైనర్ లారీని ఢీకొన్నారు. ఈ ఘటనలో మోహన్, బాబుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108కి సమాచారం అందించి క్షతగాత్రులను నగరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు. మోహన్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే కేసుల నమోదు



ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న ఎస్ఐ

బుచ్చినాయుడుకండ్రిగ, మే23: ఆటో డ్రైవర్లు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ వెంకటనరసింహ హెచ్చరించారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో గురువారం ఆటోడ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై ఎస్ఐ అవగాహన కల్పించారు. మండల కేంద్రంలోని ప్రధాన రహదారిలో ఎక్కడబడితే అక్కడ ఆటోలు నిలిపివేయడం వలన ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందన్నారు. పలుమార్లు హెచ్చరించినా మీలో మార్పు రాలేదని, ఇకపై ప్రధాన రహదారిలో ఆటోలు నిలిపితే కేసు నమోదు చేస్తామన్నారు. ప్రతి ఆటో డ్రైవర్ లైసెన్సు, వాహన పత్రాలు కలిగి ఉండాలన్నారు.

ఈతకెళ్లి యువకుడి మృతి



రాజేష్ (ఫైల్‌ఫొటో)

శ్రీకాళహస్తి, మే 23: ఈత కోసం వెళ్లిన ఓ యువకుడు మృత్యువాత పడిన ఘటన తొట్టంబేడు మండలం బసవయ్యపాళెం వద్ద గురువారం చోటు చేసుకుంది. శ్రీకాళహస్తి రెండవ పట్టణ సీఐ రారాజు కథనం మేరకు... తొట్టంబేడు మండలం కొత్తకండ్రిగకు చెందిన రాజేష్(30) ఓ ప్రైవేటు కర్మాగారంలో డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. అదే గ్రామానికి చెందిన నలుగురు స్నేహితులతో కలిసి సరదగా ఈత కొట్టేందుకు బసవయ్యపాళెంలోని బావి వద్దకు వెళ్లాడు. అక్కడ అందరు ఈత కొడుతుండగా నీటిలో మునిగిన రాజేష్ ఎంత సేపటికి బయటకు రాలేదు. దీంతో అతడి స్నేహితులు 100కు ఫోన్ చేసి సమాచారం అందించారు. శ్రీకాళహస్తి టూటౌన్ పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. అగ్నిమాపక సిబ్బంది బావిలోతుకు వెళ్లి పూడికలో కూరుకుపోయిన రాజేష్ మృతదేహాన్ని వెలికితీసి ఒడ్డుకు చేర్చారు. కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఐదుగురు బైండోవర్

బుచ్చినాయుడుకండ్రిగ, మే 23: ఎన్నికల కౌంటింగ్ దృష్ట్యా స్థానిక పోలీసులు ఐదుగురిని డిప్యూటీ తహసీల్దార్ చంద్రబాబునాయుడు దగ్గర గురువారం బైండోవర్ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా గ్రామాలలో గొడవలు సృష్టిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.

బహిరంగ ప్రకటన

[illegible]

అగిలి ఆనంద కుమార్, ఎం.ఎ., బి.ఎల్., అడ్వకేట్,

పైప్‌లైన్ పనుల్లో గోల్‌మాల్!

రేణిగుంటలో మరమ్మతు పనుల పేరుతో బురిడీ ● వేలల్లో అయ్యే పనులకు రూ.లక్షల్లో బిల్లులు పెట్టి దోపిడీ





ఎండిపోయిన బోరునుంచి పైపులను తీసేసి పెట్టిన డమ్మీ, కొత్తబోరుకు అమర్చిన పాత మోటారు

రేణిగుంట, మే23: పంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది చేయి కలిపితే ఏమైనా చేయొచ్చు అనేందుకు రేణిగుంట మేజర్ పంచాయతీలో చోటుచేసుకున్న అవినీతే ఉదాహరణగా చెప్పొచ్చు. తెలుగుగంగ నీరు మంగళం పంప్ హౌస్ నుంచి తిరుపతి, తిరుమల, దామినేడు, రేణిగుంటకు పైపులైన్ల ద్వారా చేరవేస్తున్నారు. అయితే దామినేడు, తిరుపతి, తిరుమలకు వెళ్లే పైపులైన్లు ఇప్పటి వరకు ఎక్కడా ఎలాంటి సమస్య తలెత్తకుండా సజావుగా నీటిని అందిస్తున్నారు. అయితే రేణిగుంట పంచాయతీ కొత్త పాలకమండలి ఏర్పడిన తరువాత మూడున్నర ఏళ్లుగా 15సార్లు తెలుగుగంగ పైపులైన్లు లీకేజీలు, పగుళ్లకు సుమారు రూ.50 లక్షల ఖర్చులకు వెచ్చించి మరమ్మతులు చేశారు. సరైన అవగాహనలేని రేణిగుంట పంచాయతీ సిబ్బంది ఇద్దరిని ముందుపెట్టి తెలుగుగంగ పైపులైన్‌లో నీరు వచ్చే సమయంలో మంగళం వద్ద ఉన్న పైపులైన్‌ను ఉద్దేశపూర్వకంగా లాక్ చేసి కొంత సేపటికి తెరవడంతో అధిక ఒత్తిడితో పైప్‌లైన్లు లీకేజీ, లేదా పగలిపోవడం జరిగాయి. వాటి మరమ్మతు పనులను స్థానిక ప్రజాప్రతినిధులకు అప్పజెప్పి వేలల్లో అయ్యే పనులకు రూ.లక్షల్లో ఖర్చు అయినట్లు చూపుతూ బిల్లులు పెట్టి దోపిడీ చేస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. అలాగే పంచాయతీ పరిధిలో తాగునీటి సమస్యను అధిగమించేందుకు వాస్తవంగా 6 కొత్త బోర్లు వేయగా 8 వేసినట్లు రికార్డుల్లో నమోదు చేశారు. కొత్త బోర్లకు ఆరు కొత్త మోటార్లను రూ.7లక్షలతో కొనుగోలు చేయగా ఇందులో మూడు పాత మోటార్లకు పెయింట్ కొట్టి కొత్త మోటార్లుగా కొనుగోలు చేసినట్లు లక్షల్లో నిధులు కాజేశారని ఆరోపణలున్నాయి. అలాగే ఎండిపోయిన బోర్లలో వేసిన పైపులను బయటకు తీసి కొత్త బోర్లలోకి దింపి లక్షల్లో బిల్లులు పెట్టుకుని వాటాలు పంచుకున్నారని విమర్శలున్నాయి. పంచాయతీకి వచ్చే ఆదాయంలో సింహభాగం వాటర్‌వర్క్స్ రిపేరుతో భారీ అవినీతి జరుగుతున్నా అధికారులు పర్యవేక్షణ లేకపోవడం స్పష్టంగా కనిపిస్తోంది. ఇప్పటికైనా వీటిపై కలెక్టర్ స్పందించి విచారణ చేయిస్తే వాస్తవాలు బయటకువస్తాయని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

తిరుపతి - 9160195583, 9703618708, 9703618705, 9703618710, 9985411629, 9985410347, 9985411003
చిత్తూరు - 9985411584, 9985403122
మదనపల్లె - 9985417476, 9848161191
కుప్పం - 9985403032 పలమనేరు - 9985403032
పుంగనూరు - 9985403204, పీలేరు - 9985403045
పుత్తూరు - 9985411598, శ్రీకాళహస్తి - 9985411596

WANTED

Rtd. Employee /VRS మరియు Qualified సీనియర్ సిటిజన్స్‌కి సువర్ణ అవకాశం. తిరిగి మీ పూర్వ వైభవాన్ని పునర్నిమించడం కొరకు సం.ప్ర. KUBER RESIDENCY, TPT. 89784 71248

AJT-3050

WANTED

తిరుపతిలో వివిధ బ్రాంచీలు గల హోటల్ (లాడ్జ్) నందు పనిచేయుటకు రూమ్ బాయ్స్ (10), హౌస్ కీపింగ్(6), వాచ్ మెన్లు (3) కావలెను. Cell: 7093956342

AJT-1899

రాజస్థాన్ రైలు యాత్ర

దసరా సందర్భంగా రాజస్థాన్ రైలుయాత్ర తేది.01-10-24. 11రోజులు టికెట్ 21,000/- (భోజనం, ACరూం+ ACబస్సు) కె.వాసు నెల్లూరు. సం.ప్ర. సెల్: 94913 40504

AJR-178309

బంగారం కొనబడును

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్ షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర: 7382114647

AJA-177000

పాఠకులకు ముఖ్యగమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారువితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి